www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్  సంపుటి : 16  సంచిక : 111  శుక్రవారం, సెప్టెంబర్ 04, 2026 , పేజీలు - 12  వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad







## మంత్రివర్గం నుంచి

# కొండా సురేఖ ఔట్..?

### మంత్రివర్గం నుంచి ఉద్వాసన

- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్‌కు సిఎం రేవంత్ రెడ్డి లేఖ
- సిఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు



**హైదరాబాద్,సెప్టెంబర్ 3 :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో మిగతా2లో...

## ఉద్యమాల ఖిల్లా నుంచే..

# గులాబీ గర్జన



**హైదరాబాద్,సెప్టెంబర్ 3 :** సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు నీటి విడుదల షెడ్యూల్‌ను ఈ నెల 14లోపు ప్రకటించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మిగతా2లో...



## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా

# నిరోధిస్తాం

● ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు ● ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం ● ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా హెచ్చరిక! ● మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ నేపథ్యంలో వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 :** ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చు కోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకో వడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో మిగతా2లో...

## మోదీని కలిసి తెలంగాణ

# హక్కులు అడగాలి

● కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి

● బీజేపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్



**హైదరాబాద్,సెప్టెంబర్ 3 :** తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు.

మిగతా2లో...

## కేబినేట్‌లో బీసీ వర్గానికి

# ప్రాధాన్యత..

● సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్ ● ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్‌గా గద్వాల విజయ లక్ష్మి ● రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ● కుడా ఛైర్ పర్సన్‌గా గుండు సుధారాణికి చాన్స్ ● బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం




## ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

- మోటార్‌స్పోర్ట్స్ సిటీ"ని ఏర్పాటు
- చెన్నై నగరం వేదికగా ఒలింపిక్స్
- సీఎం విజయ్ సంచలన ప్రకటన




## 9 రోజుల్లోనే రూ.9వేల కోట్ల

# రైతుభరోసా చెల్లించాం

### - మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్,సెప్టెంబర్ 3 :** తమ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రూ.36 వేల కోట్ల నిధులను రైతుభరోసా కింద రైతులకు అందించినట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ చార్జ్ షీట్ కాదని, పదేళ్ల రైతు వ్యతిరేక పాలనపై ప్రజల చార్జ్‌షీట్‌కు ఆ పార్టీ సమాధానం మిగతా2లో...

## ఎస్ఐఆర్‌లో ఆ భాధ్యత మాత్రమే

# బిఎల్ఎలది: హైకోర్టు



**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 3 :** దేశ రాజధాని ఢిల్లీలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల్లో ధ్రువీకరించలేని తప్పుడు వివరాలకు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల(బిఎల్ఏ)ను బాధ్యులుగా చేయలేమని ఢిల్లీ హైకోర్టు గురువారం స్పష్టం చేసింది. బూత్ స్థాయి మిగతా2లో...

## నేనేం తప్పు చేయకున్నా.. నన్ను బర్తరఫ్

# చేశారు: కొండా సురేఖ



**హైదరాబాద్,సెప్టెంబర్ 3 :** తానింకా రాజీనామా చేయలేదని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఎఐసిసి మల్లిఖార్జున ఖర్గేకు వివరణ ఇచ్చినా..తనను బలి చేయడం బాధాకరమని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ..అధిష్టానానికి రాసిన లేఖను విడుదల చేస్తున్నానని, తన వివరణ అడగకుండానే తనను మిగతా2లో...

# ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఔట్..?

(మొదటి పేజీ తరువాయి)

పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా చైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

**హైదరాబాద్,సెప్టెంబర్ 3 :** రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు.

కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టారు.

చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు.

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

# పరకాల నుంచి సిఎం పోటీ చేయాలి

**రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నా**
**నా తల్లికి అన్యాయం జరిగింది**
**బర్తరఫ్ నన్ను తీవ్రంగా బాధించింది**
**మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు**
**సురేఖ కుమార్తె కొండా సుస్మిత ఫైర్**



**హైదరాబాద్,సెప్టెంబర్ 3 :** తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు పెట్టారు. తల్లి బర్తరఫ్‌పై స్పందించిన సుస్మిత "నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను" అని వ్యాఖ్యానిం చారు. అంతేకాకుండా, "నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను" అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన ఓ షెల్ కంపెనీకి తక్కువ ధరకు విలువైన భూములను కేటాయించారని సుస్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. దీనికి తోడు, టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారాన్ని మరింత పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని, కొండా సురేఖ తొలగింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు, చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆమెపై వేటు తప్పలేదు.

# ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

**చెన్నై,సెప్టెంబర్ 3 :** తమిళనాడు రాజధాని చెన్నైను ప్రపంచ స్పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీ వేదికగా వెల్లడించారు. తమిళనాడు స్పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఒలింపిక్ సిటీని అభివృద్ధి చేస్తామని సిఎం ప్రకటించారు. దీని కోసం పటిష్టమైన ప్రణాళికను రూపొందిస్తామన్నారు. అధునాతన సౌకర్యాలతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి చెన్నైని ప్రపంచ ఒలింపిక్ నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. అంతేగాక ఫార్ములా వన్ రేసుల కోసం చెన్నై నగరాన్ని సిద్ధం చేస్తామన్నారు. ప్రపంచ స్థాయి మోటార్ స్పోర్ట్ పోటీలు జరిగేలా ట్రాక్‌లను నిర్మిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో చెన్నైని ప్రపంచ క్రీడా నగరంగా మార్చడమే లక్షంగా ముందుకు సాగుతామని సిఎం ప్రకటించారు.

# ఉద్యమాల ఖిల్లా నుంచే.. గులాబీ గర్జన

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశిత గడువులోగా షెడ్యూల్ ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడలో బిఆర్ఎస్ నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కెటిఆర్ విమర్శించారు. ఎన్ని తడులు నీరు విడుదల చేస్తారు.. ఎప్పుడెప్పుడు విడుదల చేస్తారు. వారబందీ విధానం అమలు చేస్తారా అనే అంశాలపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల సాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. 2003లో సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల కోసం కెసిఆర్ పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తాను కూడా పాదయాత్ర చేస్తానన్నారు. కాంగ్రెస్‌కు ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చిన ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులను ప్రభుత్వం మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# 9 రోజుల్లోనే రూ.9వేల కోట్ల రైతుభరోసా చెల్లించాం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతు వినాశనం జరిగితే కాంగ్రెస్ రెండున్నరేళ్లలో రైతు వికాసం జరిగిందని ఆ ప్రకటనలో గుర్తు చేశారు.రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. 20142018 వరకు రైతుబంధు అనే పథకమే లేదని బీఆర్ఎస్ నాయకులు గుర్తు చేసుకోవాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రైతుబంధు ప్రారంభించిన తర్వాత కూడా ప్రతి విడత నిధుల కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందని తెలిపారు. రూ.6 వేల కోట్లతో మొక్కజొన్న, రూ.2 వేల కోట్లతో జొన్నలు కొనుగోలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతుకు పెట్టుబడి సాయంతో పాటు 42.16 లక్షల మంది రైతులకు రైతుబీమా ద్వారా రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. రైతు బీమాతో పాటు పంటల బీమాను కూడా అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

# ఎస్ఐఆర్‌లో ఆ భాద్యత మాత్రమే బిఎల్ఎలది: హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

ఏజెంట్లు ఓటరు ఫోటో వంటి ధ్రువీకరించగల సమాచారానికి మాత్రమే బాధ్యత వహిస్తారని జస్టిస్ అమిత్ బన్సాల్ పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల్లోని అన్ని వివరాలను తాము వ్యక్తిగతంగా ధ్రువీకరించాలని హామీ ఇస్తూ బిఎల్ఎలు వ్యక్తిగత అంటర్‌టేకింగ్ ఇవ్వాలన్న నిబంధనను పిటిషనర్లు హైకోర్టులో సవాలు చేశారు. ఈ మేరకు ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, డిపిసిసి బూత్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ పిటిషన్లు వేశారు. ఎన్యూమరేషన్ ఫారంలో నమోదు చేసే సమాచారం మొత్తం సంబంధిత ఓటరుకే ప్రత్యేకంగా తెలిసినదని, బిఎల్ఎ పాత్ర కేవలం ఓటరుకు సహాయం చేయడానికే పరిమితమని పిటిషనర్లు వాదించారు. అందువల్ల ఆ వివరాలన్నింటినీ బిఎల్ఎ వ్యక్తిగతంగా ధ్రువీకరించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.దీనిపై హైకోర్టు విచారణ జరిపి, ఎన్యూమరేషన్ ఫారంలోని మొత్తం సమాచారానికి బిఎల్ఎను బాధ్యుడిగా చేయలేమని, ఆ సమాచారాన్ని బిఎల్ఎ ధ్రువీకరించే పరిస్థితి ఉండదని పేర్కొంది. 2002 ఓటర్ల జాబితా, తుది 2025 ఓటర్ల జాబితా ఈసిఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, లేదంటే ఈసిఐ నుంచి భౌతిక ప్రతులను పొందవచ్చని కూడా హైకోర్టు తెలిపింది. ఎస్ఐఆర్ నిర్వహణకు ఆధారంగా ఉపయోగిస్తున్న ఓటర్ల జాబితాల భౌతిక ప్రతులను పిటిషనర్లు 2026 మే వరకూ నిర్ణీత రుసుము చెల్లించి కోరవచ్చని కోర్టు పేర్కొంది.

# నేనేం తప్పు చేయకున్నా.. నన్ను బర్తరఫ్ చేశారు: కొండా సురేఖ

(మొదటి పేజీ తరువాయి)

బర్తఫ్ చేశారని, ఎఐసిసి ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ కు కూడా నా బాధంతా చెప్పుకున్నారని తెలియజేశారు. తనకూతురు ఇండిపెండెంట్.. తనతో తనకు సంబంధం లేదని.. తన ఫ్యామిలీ తనది అని కొండా సురేఖ పేర్కొన్నారు.

తన బిడ్డ మాట్లాడితే తనను బాధ్యురాలిని చేస్తున్నారని.. తానేం చేయాలి? అని ప్రశ్నించారు. రాజీనామా చేయమని తనను అడగలేదని, తాను చేయలేదని చెప్పారు. రాజకీయాల్లోకి రావాలని తనకు కోరిక ఉందని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని అన్నారు.

# రైతు లేనిదే రాజ్యం లేదు

- రైతు సంక్షేమమే బి.ఆర్.ఎస్ పార్టీ ధ్యేయం
- రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీ సవితి తల్లి ప్రేమ చూపుతుంది
- రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పతనం కాయం
- బి ఆర్.ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు
- ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి












**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03 (పీపుల్స్ న్యూస్)**

రైతు లేనిదే రాజ్యం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతోందని బి.ఆర్.ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం గోవిందరావుపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీ పాల్గొన్నారు. గోవిందరావుపేటలోని తహసిల్దార్ కార్యాలయం నుంచి ఎద్దుల బండ్ల తో మొదలైన ర్యాలీ గోవిందరావుపేట శివారులోని ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో లక్ష్మీ నరసింహారావు, నాగజ్యోతి మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ రైతుల సంక్షేమ ధ్యేయంగా రెండు గోపాలుగా పాలన అందించిందని అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఖాయమని అన్నారు. ముఖ్యంగా ములుగు నియోజకవర్గంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, స్థానిక మంత్రి తక్షణమే స్పందించాలని డిమాండ్ వారు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలకు పరిష్కారం చూపకుండా సభలు, సమావేశాలు, ఉపన్యాసాల పేరుతో కాలయాపన చేస్తూ, ప్రతి సమస్యకూ గత ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని వారు ఆరోపించారు.

**లక్నవరం సమస్యపై హామీ ఏమైంది?**

ములుగు ప్రాంత రైతాంగానికి లక్నవరం జలాశయం అత్యంత కీలకమైన సాగునీటి వనరని,దాని కింద ఉన్న పంట పొలాలకు అవసరమైన సమయంలో నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో లక్నవరం సమస్యను పదే పదే ప్రస్తావించిన మంత్రి సీతక్క నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత దాని పరిష్కారానికై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు.మేడారం సమ్మక్క-సారలమ్మ తల్లుల సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్నవరం నీటిని జంపన్నవాగు తో అనుసంధానం చేసేందుకు రూ.36 కోట్లతో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని, ఆ హామీ అమలుపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం రైతాంగాన్ని నిరాశకు గురిచేస్తోందని అన్నారు.రైతుకు ప్రాజెక్టుల పేర్లు, హామీలు కాకుండా పంట కాలంలో పొలానికి చేరే నీరే ముఖ్యమని,అందువల్ల లక్నవరం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

**పంట నష్టపరిహారంపై లెక్కలు చెప్పాలి**

2024లో కురిసిన వడగండ్ల వానలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించారని, మ ులుగు ప్రాంతానికి సంబంధించి రూ.5.75 కోట్ల నిధులు విడుదలయ్యాయని వారు తెలిపారు.అయితే ఆ నిధులు రైతులకు చేరకుండా ఏక్కడికి చేరాయనే విషయాలను ప్రభుత్వం, మంత్రి సీతక్క ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.పేరుతోవిడుదలైననిధులవిషయంలో పారదర్శకత ఉండాలని, అర్హులైన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**రైతు భరోసా విషయంలో స్పష్టత ఎక్కడ..?**

ఎన్నికల సమయంలో రైతు పెట్టుబడి సాయాన్ని పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని వారు గుర్తుచేశారు. హామీకి అనుగుణంగా రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందడం లేదని వారు విమర్శించారు.వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడి సాయం రైతుకు ఎంతో కీలకమని అన్నారు.విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం ఆలస్యం కావడం చిన్న, సన్నకారు రైతులపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతుందని వారు పేర్కొన్నారు.అందువల్ల రైతు భరోసా అమలుపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించి, అర్హులైన రైతులందరికీ సమయానికి ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

**ధాన్యానికి గిట్టుబాటు ధర ఎక్కడ..?**

రైతు పంట పండించడం మాత్రమే కాకుండా దానిని సరైన ధరకు విక్రయించగలిగినప్పుడే వ్యవసాయం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని వారు పేర్కొన్నారు.ధాన్యం .కొనుగోలు సమయంలో గిట్టుబాటు ధర లభించకపోవడం, ప్రకటించిన బోనస్ కూడా సమయానికి అందకపోవడం రైతులకు నష్టాన్ని కలిగిస్తోందని వారు విమర్శించారు.ప్రకటనలకే పరిమితం కాకుండా బోనస్ ఎప్పుడు చెల్లిస్తారని,అర్హులైన రైతులు ఎంతమంది, ఎంత మొత్తం విడుదల చేశారనే వివరాలను సైతం ప్రభుత్వం వెల్లడించాలని కోరారు.

**సమ్మక్క బ్యారేజ్, దేవాదుల నీటిని వినియోగించాలి**

ములుగు జిల్లాలో సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గతంలో చేపట్టిన దేవాదుల, సమ్మక్క బ్యారేజ్ వంటి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని వారు సూచించారు. సమ్మక్క బ్యారేజ్ ద్వారా నీటిని నిల్వ చేసి ములుగు జిల్లాలోని వివిధ మండలాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ, ఆ వనరులను సమర్థవంతంగా వినియోగించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు.ఇక్కడ రాజకీయ విమర్శల కంటే.. ముఖ్యమైనది ప్రాజెక్టుల సామర్థ్యాన్ని ఎంతవరకు వినియోగిస్తున్నారన్నదే ముఖ్యమని అన్నారు.ఎంత ఆయకట్టుకు నీరు అందుతోంది, ఇంకా ఎంత భూమికి నీరు అందించాల్సి ఉంది, అందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి అనే వి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

**పోడు భూముల సమస్యకు పరిష్కారం కావాలి**

ములుగు జిల్లాలో పోడు భూముల సమస్య ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. భూమిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు హక్కుల విషయంలో స్పష్టత కల్పించడం అత్యవసరమని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం అర్హులైన గిరిజనులు, గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.పట్టాల సమస్య పరిష్కారమైతే రైతులకు భూమిపై చట్టబద్ధమైన హక్కుతో పాటు వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ పథకాలు, పెట్టుబడి సాయం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం మెరుగుపడుతుందని అన్నారు . ఈ అంశాన్ని రాజకీయ ప్రకటనలకు పరిమితం చేయకుండా స్పష్టమైన విధానంతో పరిష్కరించాలని వారు కోరారు.

**గత ప్రభుత్వాన్ని విమర్శించడం పాలనకు ప్రత్యామ్నాయం కాదు**

ప్రస్తుత ప్రభుత్వం ప్రతి సమస్యకు గత ప్రభుత్వాన్ని బాధ్యుడిగా చూపడం వల్ల సమస్యలు పరిష్కారం కావని వారు విమర్శించారు.గత ప్రభుత్వంలో తప్పులు జరిగి ఉంటే వాటిపై విచారణ జరిపించడం ప్రభుత్వ హక్కు. అయితే అదే సమయంలో ప్రస్తుత పాలనపై ప్రజలకు జవాబుదారీతనం గా ఉండాలని వారు అన్నారు.గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం ఒక రాజకీయ వాదన కావచ్చని,కానీ ప్రస్తుత సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలో ఇప్పటికీ గత పాలననే ప్రధాన రాజకీయ అంశంగా చేసుకోవడం కంటే, తమ ప్రభుత్వం సాధించిన ఫలితాలపై ప్రజలకు లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు.ములుగు రైతాంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు పరస్పరం అనుసంధానమైనవేనని, సాగునీరు లేకపోతే పంట నష్టపోతారని అన్నారు . పంట పండినా సరైన ధర లేకపోతే ఆదాయం తగ్గుతుందని,ప్రకృతి వైపరీత్యం వస్తే పరిహారం ఆలస్యం అయితే అప్పులు పెరుగుతాయని ఆరోపించారు. భూమిపై హక్కు లేకపోతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడం కష్టమవుతుందని అన్నారు.కాబట్టి రైతు సమస్యలను విడివిడిగా కాకుండా నీరు--పెట్టుబడి--పంట ధర--పరిహారం--భూ హక్కులు అనే సమగ్ర వ్యవసాయ విధానంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను గల్లి గల్లికి ఎండబెడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గోవింద నాయక్, మల్క రమేష్,భూక్యా జంపన్న,లకవత్ నరసింహ,సుడి శ్రీనివాస్ రెడ్డి,లకావత్ చందులాల్,తాటికొండ శ్రీనివాసచార్యులు,గజ్జి ఎలేందర్,పెన్నిటి మధుసూదన్ రెడ్డి, అక్కనపల్లి రమేష్, మెర్దుల వెంకన్న, వర్ధన్ చందర్, చర్ల పాండు, ప్రవీణ్ గౌడ్,బి శీను,శ్యామ వెంకట్ రెడ్డి,ఎడవెల్లి వెంకటరెడ్డి, నామ పూర్ణచందర్, అజ్మీర సురేష్, మాలోత్ గాంధీ,పోరిక కిరణ్, కుమార్ లావుడియా ,రామచందర్ సరూప,లకావత్ మమత, చందులాల్,సమ్మక్క,ధరావత్ రాకేష్,చిలుకూరి రాజ్ కుమార్, కత్తుల సారయ్య, నామాల మురళి, వాసం శివాజీ ,ఏకుల ధనుంజయ, సూడి సతీష్,బొజ్జ నరేందర్, సొరపాక లక్ష్మీనారాయణ, జల్లెల కొమురయ్య, చల్లూరి రామకృష్ణ, గుమ్మడి ప్రసాద్,బత్తుల రాణి, రుద్రాపు రాజశేఖర్, సమ్మయ్య, పూలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవి పేటలో ఎస్ ఐ ఆర్ లో అనామాలిస్ సరిచేసే ప్రక్రియ



**వెంకటాపూర్, ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3 (పీపుల్స్ న్యూస్ )**

వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామంలో ఎస్ ఐ ఆర్ అనామాలిస్ సరిచేసే ప్రక్రియలో భాగంగా గురువారం నోటీసులు ఇచ్చిన ఓటర్లు సరి చేసుకోవడానికి గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిటి భవాని ప్రసాద్ హాజరై మాట్లాడారు. గ్రామంలో ఓటర్ లిస్టు పేరు రాక ఉన్నవారు అనామాలిస్ ప్రక్రియలో భాగంగా సరిచేసుకోవడానికి గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఓటర్ లిస్టు లో భాగంగా వారి డాక్యుమెంట్స్ సరిచూసుకొని ఓటర్ లిస్ట్ ఓటర్ లిస్టులో పేరు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మ కంటి వంశావతీ రమేష్, ఉపసర్పంచ్ కొండ తిరుపతి, ఆర్ ఐ నగేష్ జిపిఓ స్వామి, బి ఎల్ ఓ లు లక్ష్మణ్, రవికుమార్, రజిని, గ్రామపంచాయతీ సిబ్బంది మునిగల రామకృష్ణ, నోటీసులు ఇచ్చిన ఓటర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 420 హామీలు బూటకపు 6 గ్యారంటీలపై బీఆర్ఎస్ పోరుబాట.

**-- బాలానగర్ డివిజన్‌లో సెప్టెంబర్ 4న బీఆర్ఎస్ డివిజన్ స్థాయి సమావేశం ..**



**బాలానగర్ సెప్టెంబర్ 04 ( పీపుల్స్ న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా బాలానగర్ డివిజన్ స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. బాలానగర్ డివిజన్ వినాయక్ నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద సెప్టెంబర్ 4న ఉదయం 9 గంటలకు ఈ సమావేశం జరగనుంది. బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి కూకట్‌పల్లి నియోజకవర్గం హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి, ఆరు గ్యారంటీల అమలు తీరుపై సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రజా ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు, పార్టీ శ్రేణుల కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి బాలానగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త రెడ్డి సతీష్ అరోరా పిలుపునిచ్చారు.

# క్రిస్టియన్ మైనారిటీలకు గ్రాఫిక్ డిజైన్ విత్ ఏఐ టూల్‌లో శిక్షణ, ఉపాధి అవకాశాలు.

**- జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్**

**- దరఖాస్తు సమర్పణకు సెప్టెంబర్ 10 చివరి తేదీ**



**ఖమ్మం, సెప్టెంబర్-03(**

తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2026-27 సంవత్సరానికి క్రిస్టియన్ మైనారిటీలకు గ్రాఫిక్ డిజైన్ విత్ ఏఐ టూల్ లో శిక్షణ అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు క్రిస్టియన్ మైనారిటీ వర్గానికి చెందిన వారై ఉండాలని, పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం 2 లక్షలలోపు, గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని, కనీస విద్యార్హతగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు.అర్హత కలిగిన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తులను కలెక్టరేట్ రెండవ అంతస్థు, ఎస్-29లో గల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో లేదా బల్లేపల్లిలో యూనియన్ బ్యాంక్ పైన గల విన్సేల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో సమర్పించాలని తెలిపారు.దరఖాస్తు సమర్పణకు సెప్టెంబర్ 10 చివరి తేదీ అని, అర్హత కలిగిన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు ఈ శిక్షణ, ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9704003002 మొబైల్ నంబర్ నందు సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అధికారం ఉన్నా లేకపోయినా మీ కష్టంలో నేనుంటా మీ వెంటే నడుస్తా కాకుల మర్రి లక్ష్మణ్ బాబు



**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03 ( పీపుల్స్ న్యూస్)**

ములుగు మట్టి సాక్షిగా ఈ ఊపిరి ఉన్నంతవరకు ప్రజల సేవకే నా జీవితం అంకితం మీ బీ ఆర్ ఎస్ ములుగు జిల్లా






# సర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం:**

భూములకు సంబంధించిన సర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి డిఎస్.లోకేశ్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఉన్నతస్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శిగా డిఎస్.లోకేశ్ కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి(రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు) రాజీవ్ గాంధీ హనుమంతు భద్రాద్రి ఐడిఓసికి గురువారం రావడం జరిగింది. వీరిని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సాదరంగా ఆహ్వానించి మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. అనంతరం ఖమ్మం భద్రాద్రి జిల్లాలో జరుగుతున్న భూ-సర్వే, సాదా బైనమా రెవిన్యూ సదస్సులు తదితర అంశాలపై అధికారులతో ఐడిఓసి లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రివ్యూ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ రీ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు సలహాలు సూచనలు అందించారు. ఈ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ దివాకర్, భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట్,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ కుమార్,ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు: కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల సెప్టెంబర్ 3:** మంచిర్యాల, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా నోటీసులు అందు కున్న ఓటర్ల నుంచి వచ్చిన ధ్రువపత్రాల పరిశీలన, హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు.మార్కింగ్ కాని, అనామలీ జాబితాల్లో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి సమర్పించిన ఆధారాలను త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్లు తమ వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలను సకాలంలో సమర్పించేలా బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా రాజకీయ పార్టీలు అవగాహన కల్పించాలని కోరారు.ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతంగా వ్యవహరించడంతో పాటు సమర్థవంతంగా ప్రక్రియ పూర్తయ్యేందుకు అన్ని వర్గాలు సహకరించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ప్రత్యేక ఉపపాలనాధికారి చంద్రకళ, డీఆర్వో మోతిరామ్, డీపీఓ రమేష్‌తో పాటు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం.

**-టి.ఆర్.వి.కె.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్.**



**మంచిర్యాల సెప్టెంబర్ 03 (పోలీస్ నిఘా):** కార్మికులకు నిరంతరం అండగా ఉంటూ వారి హక్కుల కోసం పోరాటం చేస్తున్న సంఘం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టి.ఆర్.వి.కె.ఎస్) అని రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ అన్నారు. గురువారం మంచిర్యాలలోని ప్రాంతీయ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికుల సంక్షేమం హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్నామని ప్రభుత్వం యాజమాన్యంతోను చర్చలు జరుపుతూ కార్మికులకు రావాల్సిన హక్కులను సంక్షేమ ఫలాలను పదోన్నతులను సాధించేందుకు టి.ఆర్.వి.కె.ఎస్ కృషి చేస్తున్నదని అన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి సమస్యను తమ సమస్యల భావించి అవసరమైన సందర్భంలో చర్చల ద్వారా లేదా పోరాటం ద్వారా ముందుకు సాగుతున్నామన్నారు. మంచిర్యాల ప్రాంతంలో కార్మికులు సంఘటితంగా ఉండి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 327 యూనియన్ నుంచి దాదాపు 20 మంది టి.ఆర్.వి.కె.ఎస్ లో చేరగా వారిని సంఘములోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు, గౌరవ అధ్యక్షుడు కోడూరు ప్రకాష్ గౌడ్, రాష్ట్ర అదనపు కార్యదర్శి పూదరి గోపాల్ రావు, టిజి ఎన్పిడిసిఎల్ కంపెనీ అధ్యక్షుడు ఎండి అజీజ్, కంపెనీ కార్యదర్శి బండారి ప్రభాకర్, మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు కొంక శ్రీనివాస్, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అశోక్ రావు, కంపెనీ అసిస్టెంట్ సెక్రటరీ చంద్రగిరి లక్ష్మణ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కే. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ముస్కే నరసయ్య, మంచిర్యాల జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.హెచ్ విజయానంద్, జిల్లా కోశాధికారి సుధాకర్, మంచిర్యాల డివిజన్ అధ్యక్షులు దామోదర్ రాజ్, జిల్లా సెక్రెటరీ వినోద్, మంచిర్యాల డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్, కోశాధికారి కృష్ణ, బెల్లంపల్లి డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, కోశాధికారి అనిల్ ఇతర జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు

**వైద్య అధికారిని సరోజ...**




**చెన్నారావుపేట సెప్టెంబర్3 :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గొల్లపల్లి, చెన్నారావుపేట, అమీన్ పేట, గుర్రాలగండిరాజపల్లి గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ సరోజ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలలోని జ్వరపిడుతులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాలలో చెత్త చెదారం లేకుండా, మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమ తెరలు వాడాలని గ్రామస్థులకు సూచించారు. జ్వరపిడితులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ భద్రయ్య, ఎం ఎల్ హెచ్ పిలు డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ సహజ, యమున, హెల్త్ సూపర్ వైజర్లు కీర్యా, హెల్త్ అసిస్టెంట్లు లింగమూర్తి, , సురేందర్, ఏఎన్ఎంలు పుష్పలత, పుష్పలీల, రజిని, సరిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులను నిలువునా ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు**
- **నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి ధ్వజం**





**ములుగు జిల్లా :** గోవిందరావుపేటలో కాంగ్రెస్ వైఫల్య పాలనపై బిఆర్ఎస్ భారీ నిరసన ర్యాలీ సాగునీరు లేక ఎండిపోతున్న పొలాలు యాసంగి నాటికి రైతు పరిస్థితి మరీ దారుణం పంపులు ఆన్ చేసే తెలివి లేని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక మంత్రి సీతక్క వైఫల్యంపై నిలదీత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్య పాలనకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా, ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ఎండిపోతున్న పొలాలు స్థానిక మంత్రి వ్యవసాయానికి మారుపేరైన గోవిందరావుపేట ప్రాంతంలో సాగునీరు అందక నేడు భూములు నెర్రెలు బారాయని ఆవేదన వ్యక్తం చేశారు స్థానిక మంత్రి సీతక్క నిత్యం ఈ ప్రాంతంలోనే తిరుగుతున్నా, కంటిముందు ఎండిపోతున్న పంటలు కనిపించడం లేదా అని నిలదీశారు దేవాదుల ప్రాజెక్టుపై నిర్లక్ష్యం ఉమ్మడి వరంగల్ జిల్లాకు గుండెకాయ లాంటి దేవాదుల ప్రాజెక్టులో గతంలో కేసీఆర్ అదనంగా 6 పంపులు అమర్చి 4 లక్షల ఎకరాలకు నీరు అందించారని గుర్తుచేశారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న పంపులను నడిపే తెలివి కూడా లేదని, బిఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, కేటీఆర్ ఒత్తిడి తెస్తే తప్ప పంపులు ఆన్ చేయలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.లక్నవరం కెనాల్‌పై నిర్లక్ష్యం గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం లక్నవరం కెనాల్ తవ్వకాలకు పూనుకుంటే రైతులను రెచ్చగొట్టి అడ్డుకున్న సీతక్క అధికారంలోకి వచ్చి 3 ఏళ్లవుతున్నా కనీసం 3-4 కిలోమీటర్ల కెనాల్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారుఈ రోజు కెనాల్ పూర్తయి ఉంటే లక్నవరం నిండి పొలాలు పండేవని, వానాకాలంలోనే ఇలా ఉంటే రాబోయే యాసంగిలో రైతుల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు.రుణమాఫీ, రైతుబంధు దగా: రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి సగం మందికి కూడా చేయకుండా అతిపెద్ద మోసానికి పాల్పడ్డారని విమర్శించారుకేసీఆర్ ఇచ్చిన రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 15,000 ఇస్తామని చెప్పి, నాలుగు విడతల డబ్బులను ఎగ్గొట్టి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను తీవ్రంగా దగా చేసిందని మండిపడ్డారుయూరియా కష్టాలు సొసైటీలపై భారం గతంలో నేరుగా లభించిన యూరియా కోసం ఈరోజు రైతులు ఉదయాన్నే 5 గంటలకే లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ( పి ఎ సి ఎస్) ప్రభుత్వం ఇచ్చే ట్రాన్స్‌పోర్ట్, లోడింగ్ ఛార్జీలను నిలిపివేసి సొసైటీలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు3 ఏళ్లలో కాళేశ్వరం పూర్తి చేసిన కేసీఆర్ పై కాంగ్రెస్ నాయకులు 'కూలేశ్వరం' అని దుష్ప్రచారం చేశారని, నేడు సాగునీరు అందించడం చేతకాక రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో పోరిక గోవింద్ నాయక్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు , గోవిందరావుపేట అధ్యక్షులు లక్క వత్తు నరసింహా, తాటి కృష్ణ, మాజీ ఎంపీటీసీ చందులాల్, మోహన్ రాథోడ్, స్వరూప, రామ్,చంద్రు, సర్పంచులు సీతారామ నాయక్, గాంధీ, రాకేష్, ఎండి వలీ బాబా, ఎండి ఖాజా పాషా, తాడూరి రఘు, కర్ర రవీందర్, ఎలవర్తి శ్రీనివాస్, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజరావు, వావిలాల పోశయ్య , కటుకూరి రాఖి, బాస శరత్, గోవిందరావుపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




## అంగడి సంత రోజున భారీ వాహనాలను దారి మళ్లించాలి

**అంబేద్కర్ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి**

**ఎస్పీకి తెలంగాణ రాజ్యాధికార పార్టీ వినతి**



**భూపాలపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03 ( పీపుల్స్ న్యూస్)** తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆదేశానుసారం జిల్లా పోలీస్ ఎస్పీకి పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూపాలపల్లి టౌన్‌లోని సుభాష్ కాలనీ రోడ్డులో ప్రతి గురువారం అంగడి సంత జరుగుతుందని తెలిపారు. ఈ సంతకు భూపాలపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తుంటారని పేర్కొన్నారు.అదే సమయంలో సమీపంలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు--1, 2కు అవసరమైన బొగ్గు రవాణా కోసం భారీ లారీలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. సంత జరిగే సమయంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా సంతకు వచ్చే ప్రజలు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.కావున ప్రతి గురువారం సంత జరిగే సమయంలో భారీ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో దారి మళ్లించి, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని ఎస్పీని కోరారు.అదేవిధంగా భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ లేకపోవడం వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అక్కడ ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు.ఈ సమస్యలపై ఎస్పీ సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పార్టీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్, పార్టీ అధికార ప్రతినిధి సంతోష్, రంజిత్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ..!

**- వెయ్యి రోజులుగా ఫామ్‌హౌస్‌కే కేసీఆర్ పరిమితం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**




**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్, సెప్టెంబర్ 3 :** తెలంగాణ రాష్ట్రానికి కాపలా కుక్కలా ఉంటానని చెప్పిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గత వెయ్యి రోజులుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, ఆ కాపలా కుక్క ఎక్కడికి వెళ్లిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వానికి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ తీరును నిరసిస్తూ షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన సభ నిర్వహించారు.యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి స్థానిక చౌరస్తా వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ఉన్నట్టుగా రూపొందించిన ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ,, ప్రగతి భవన్ ముందు కంచె తొలగించి ప్రజా భవన్‌గా మార్చి దొరల అహంకారానికి చరమగీతం పాడి వెయ్యి రోజులు పూర్తయ్యాయని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాల్సిన కేసీఆర్ సభకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు.కేసీఆర్ వెయ్యి రోజుల్లో రూ.1.24 కోట్లకు పైగా జీతం తీసుకున్నారని, ప్రభుత్వ ఉద్యోగి విధులకు హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటారని, మరి ఇన్ని రోజులు ప్రజలకు అందుబాటులో లేని కేసీఆర్‌ను ఏం చేయాలని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఆయనకు భద్రత, ఇల్లు, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు తదితర సౌకర్యాల కోసం ప్రభుత్వం సుమారు రూ.21 కోట్లు ఖర్చు చేసిందని ఆరోపించారు. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణను ధనిక రాష్ట్రంగా తమకు అప్పగిస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అప్పులు చేసిందని ఎమ్మెల్యే శంకర్ ఆరోపించారు. పదేళ్ల పాలనలో సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని, గత ప్రభుత్వాల అప్పులతో పోలిస్తే కేసీఆర్ హయాంలోనే భారీగా అప్పులు పెరిగాయని విమర్శించారు.అప్పులు, వాటి వడ్డీల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా వేల కోట్ల రూపాయలు చెల్లించాల్సి వస్తోందని అన్నారు. ప్రజా ప్రభుత్వంపై బురదజల్లేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని, ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరారు.

**అంజయ్య యాదవ్ కుటుంబంపైనా విమర్శలు**

స్థానిక మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్,ఆయన కుమారులపై కూడా ఎమ్మెల్యే శంకర్ విమర్శలు చేశారు. కేసీఆర్ కుటుంబం ఫామ్‌హౌస్‌లో విలాసవంతమైన జీవితం గడుపుతోందని విమర్శిస్తున్న వారు ముందుగా తమ గతాన్ని పరిశీలించుకోవాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యేకు ఫామ్‌హౌస్ లేదా అని ప్రశ్నించారు.ఎదుటివారిపై విమర్శలు చేసే ముందు గతంలో అధికారంలో ఉన్నప్పుడు తాము ఏం చేశామో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయ విలువలను దిగజార్చి అధిష్ఠానం దృష్టిలో పడేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే శంకర్ ప్రస్తావించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్న హామీ ఏమైందని, తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానన్న కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు పదవులు ఇచ్చుకున్నారని విమర్శించారు.దళితులకు మూడెకరాల భూమి,గిరిజనులు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.షాద్‌నగర్ నియోజకవర్గానికి ఇచ్చిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ హామీని కూడా గుర్తు చేశారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం కుర్చీ వేసుకుని కూర్చుంటానన్న కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు.80 వేల పుస్తకాలు చదివిన మేధావినని చెప్పుకునే కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై ఎందుకు మాట్లాడటం లేదని ఎమ్మెల్యే శంకర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందంటూ ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు తాండ్ర విశాల, శ్రావణ్ రెడ్డి, పంది వెంకట్ రాంరెడ్డి, కాంగ్రెస్ సమన్వయ కమిటీ కన్వీనర్ రఘునాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కొత్తూరు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ పాల్గొన్నారు.

# పదేళ్ల పాలనకు లెక్క చెప్పాలి.. ఆ తర్వాతే కాంగ్రెస్‌పై మాట్లాడాలి

**-- దళితులు, పేదలను మోసం చేసిన చరిత్ర మాధవరం కృష్ణారావుదే: కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్**

**బాలానగర్ సెప్టెంబర్ 04 ( పీపుల్స్ న్యూస్)** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పదేళ్లుగా అధికారంలో ఉండి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేశారో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనపై లెక్క చెప్పకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. దళితుల సంక్షేమం పేరుతో ప్రకటించిన దళితబంధు పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని దళితులను మాధవరం కృష్ణారావు మోసం చేశారని మదన్ మోహన్ ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో ఎంతమంది దళిత కుటుంబాలకు పథకం అందేలా కృషి చేశారో ఎమ్మెల్యే స్పష్టం చేయాలని ప్రశ్నించారు. అలాగే ఇళ్లు లేని నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి రెండుసార్లు ఓట్లు పొందారని, అయితే ఆ హామీని ఎంతవరకు నెరవేర్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. దళితబంధు, రెండు పడక గదుల ఇళ్ల విషయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. “సొంత నిధులతో అభివృద్ధి చేశానంటే.. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి” నా సొంత నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశాను” అని ఎమ్మెల్యే మాధవరం



కృష్ణారావు పదేపదే చెప్పుకుంటున్నారని గుర్తుచేసిన మదన్ మోహన్, ఆయనకు కొన్ని సూటి ప్రశ్నలు సంధించారు.

**-- దళిత కుటుంబాలకు తన సొంత నిధులతో దళితబంధు తరహా ఆర్థిక సహాయం ఎందుకు అందించలేదు?**

ఇళ్లు లేని నిరుపేదలకు తన సొంత నిధులతో రెండు పడక గదుల ఇళ్లు ఎందుకు నిర్మించలేదు? పదేళ్లు అధికారంలో ఉండి ప్రధాన హామీలను ఎందుకు పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయారు?నియోజకవర్గంలో 90 శాతం అభివృద్ధి పనులు తన హయాంలోనే పూర్తయ్యాయని చెబుతున్న ఎమ్మెల్యే.. ఇప్పుడు అభివృద్ధి జరగడం లేదని ఎందుకు ఆరోపిస్తున్నారు? అని మదన్ మోహన్ ప్రశ్నించారు.“అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి అంతా తన ఘనతే అని చెప్పుకోవడం.. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి జరగడం లేదని విమర్శించడం మాధవరం కృష్ణారావు ద్వంద్వ వైఖరికి నిదర్శనం” అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూకట్‌పల్లి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మదన్ మోహన్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు.

**“మాటలు కాదు.. పదేళ్ల పాలనకు లెక్కలు కావాలి”**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన గురించి మాట్లాడే ముందు మాధవరం కృష్ణారావు తన పదేళ్ల పాలనకు ప్రజలకు లెక్క చెప్పాలని మదన్ మోహన్ డిమాండ్ చేశారు. దళితబంధు, రెండు పడక గదుల ఇళ్లు, నియోజకవర్గ అభివృద్ధి తదితర అంశాల్లో తాను ఇచ్చిన హామీలు, వాటి అమలుపై స్పష్టమైన వివరాలు వెల్లడించిన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిపై మాట్లాడాలని సూచించారు.“కూకట్‌పల్లి ప్రజలకు ఇప్పుడు మాటలు కాదు.. పదేళ్ల పాలనకు లెక్కలు కావాలి. ఇచ్చిన హామీలు ఏమిటి? అమలు చేసినవి ఎన్ని? ప్రజలకు అందిన ప్రయోజనాలెన్ని? అనే విషయాలపై మాధవరం కృష్ణారావు సమాధానం చెప్పాలి” అని మదన్ మోహన్ స్పష్టం చేశారు.

# రైతు సమస్యలపై బీఆర్ఎస్ పోరుబాట

**కాంగ్రెస్ పాలనలో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్లిందని ఆడే సురేష్ విమర్శ**



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, సెప్టెంబర్ 3 :** రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ గ్రామంలో గురువారం రైతు సదస్సు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేష్, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ సయ్యద్ కాశీం హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆడే సురేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత తగ్గడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతు సంక్షేమ పథకాలు బలహీనపడ్డాయని విమర్శించారు.రైతులకు సాగునీటి భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు చేయడం ద్వారా సాగునీటి ప్రయోజనాలకు నష్టం కలుగుతోందని ఆరోపించారు. అలాగే 22-ఏ, భూ భారతి అంశాల పేరుతో భూములకు సంబంధించిన సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, సాగునీరు, పెట్టుబడి సహాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉర్వత రూపదేవ్, టౌన్ ప్రెసిడెంట్ ఫేరోజ్ ఖాన్, చౌహాన్ యశ్వంతరావు, రాఠోడ్ సుభాష్, షేక్ మసూద్, మహిళా నాయకురాలు రాఠోడ్ దేవకాబాయి తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో 100 సీసీటీవీ కెమెరాలు ప్రారంభం

- నేరాల నియంత్రణకు సాంకేతిక నిఘా కీలకం
- నిందితుల గుర్తింపుతో పాటు రోడ్డు ప్రమాదాల ఛేదనలో కెమెరాలదే కీలకపాత్ర
- ప్రారంభించిన శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సిహెచ్. శ్రీనివాస్, రామచంద్రాపురం ఏసీపీ శ్రీనివాస్













నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, నిందితుల గుర్తింపులో సీసీటీవీ కెమెరాలు కీలకంగా పనిచేస్తున్నాయని శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సిహెచ్. శ్రీనివాస్ ఐపీఎస్ అన్నారు. ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 100 సీసీటీవీ కెమెరాలను డీసీపీ సిహెచ్. శ్రీనివాస్, రామచంద్రాపురం ఏసీపీ శ్రీనివాస్ ప్రారంభించారు.బొల్లారం సీఐ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల సహకారంతో ఈ సీసీటీవీ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ప్రజల భద్రతతో పాటు నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాలు అత్యంత ప్రభావవంతమైన సాధనమని తెలిపారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర నేరాలకు సంబంధించిన కేసుల్లో ఘటనకు సంబంధించిన దృశ్యాలను విశ్లేషించడం ద్వారా కేసుల ఛేదన సులభతరమవుతుందని పేర్కొన్నారు.పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీసీటీవీ నిఘా విస్తరించడం వల్ల నేరాలకు అడ్డుకట్ట పడటంతో పాటు నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయాన్ని కలిగించవచ్చని డీసీపీ తెలిపారు. ప్రజలు కూడా తమ నివాసాలు, వాణిజ్య సముదాయాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని సూచించారు.

100 సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ఖాజీపల్లి మున్సిపల్ చైర్మన్, ఎన్వీఆర్ పాఠశాల, జాయ్ ఇంటర్నేషనల్ పాఠశాల, పీబీఆర్ హాస్పిటల్, హెడ్‌క్వార్టర్ రెస్టారెంట్, మైత్రి కన్స్ట్రక్షన్స్, ఐటీసీ పరిశ్రమ, జెన్‌ఎక్స్ పరిశ్రమ, ఆర్‌ఆర్‌కే హబ్ ప్రతినిధులను పోలీసు సిబ్బంది చిరు సన్మానంతో అభినందించారు.ఈ కార్యక్రమంలో ఖాజీపల్లి సీనియర్ నాయకులు గద్దె నర్సింహా, ఎస్ఐ అక్షిత, బొల్లారం ఇండస్ట్రీస్ అధ్యక్షులు ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శి రాయుడు, జాయ్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, సతీష్, ఎన్వీఆర్ స్కూల్ యాజమాన్య ప్రతినిధి వెంకట్రావు, మైత్రి కన్స్ట్రక్షన్స్ ప్రతినిధి కొండల్ రెడ్డి, హెడ్‌క్వార్టర్ హోటల్ యాజమాన్య ప్రతినిధులు శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

**- ఫోటో 201 తాసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ధర్నాలో మాట్లాడుతున్న టిఆర్ఎస్ నాయకులు**

**-202 డిప్యూటీ తాసిల్దార్ కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు ..**





**కనగల్ 03 సెప్టెంబర్ :** ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన--వైఫల్యాల పేరుతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై కోపంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం, రుణమాఫీ వంటి హామీలు అమలు కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్య గౌడ్ మాజీ ఎంపీపీ కరీంపాషా, జిల్లా నాయకులు గోన రవీందర్రావు, ఎర్రబెల్లి నర్సిరెడ్డి, జొన్నలగడ్డ శేఖర్ రెడ్డి పిఏసిఎస్ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి దోటి శ్రీనివాస్ మహిళా అధ్యక్షురాలు మరియు రేణుక సర్పంచులు జానయ్య గౌడ్ సార్ కొద్దిగా నేమ్స్ యాడ్ చేయండి యాగ్రమాద వెంకట్ రెడ్డి, సుంకిరెడ్డి వెంకట్ రెడ్డి, సుంకిరెడ్డి నర్సి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలేరులో మళ్ళీ గెలిచేది... నిలిచేది కాంగ్రెస్సే మంత్రి పొంగులేటి.

**ఖమ్మం సెప్టెంబర్ 3** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా.. కాంగ్రెస్ ఆధ్వర్యంలో 1,000 బైకులతో నాయకన్ గూడెం నుంచి కూసుమంచి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓపెన్ టాప్ జీపులో ముందుకు సాగుతూ.. పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహ ం నింపారు. ఈ సందర్భంగా కూసుమంచి ప్రధాన సెంటర్లో కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. 3,475 రోజుల మీ పాలనలో చేసిందేమీ లేదు...లిపిల్ల కాకులు కారు కూతలు మానుకోవాలంటూ హెచ్చరికప్రజలు బీఆర్ఎస్ దొరను ఫామ్ హౌస్ కే పరిమితం చేశారనే అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజాపాలనపై బీఆర్ ఎస్ నేతలు విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 3,475 రోజుల వారి పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. పేదలకు ఇందిరమ్మ ఇళ్లిచ్చామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్, నిరుద్యో గులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇలా ఎన్నో చేసామని వివరిం చారు. నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా...తమ పాలనలో చూపామని అన్నారు.అసలు పెద్ద దొరనే ఫామ్ హౌస్ కు పరిమి తం అయ్యాడని, పిల్ల కాకులు కారు కూతలు మానుకోవాలని హితవు పలికారు.అభివృద్ధి, సంక్షేమాన్ని పేదల గడపకు చేర్చాం..ప్రజల దీవెనలతో తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చి..సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం పేదల ఇంటి గడపలకు చేర్చి వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన రంగాలను ఒక్కొక్కటిగా సరిదిద్దుతున్నామని, రైతులు పాలేరు నియోజ కవర్గం అంటే తనకు సొంతిల్లు అని, ఎవరెన్ని పొర్లుదండాలు పెట్టినా.. మళ్ళీ ఇక్కడ గెలిచేది, నిలిచేది ముమ్మాటికీ కాంగ్రెస్సే అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో..: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బజ్జురి వెంకటరెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి హఫీజ్ ఉద్దీన్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, జూకూరి గోపాలరావు, కూసుమంచి సర్పంచ్ కొండా కృష్ణవేణి, పాలేరు సర్పంచ్ బానోత్ నాగేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తుక్కుగూడలో ఉన్మాది చేతిలో హత్యాచారానికి గురైన నర్సు కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చిన కేటీఆర్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా** ముల్కలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన బాధిత యువతి కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించి భరోసానిచ్చిన కేటీఆర్‌కేటీఆర్ సూచనల మేరకు యువతి కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేలు ఆర్థికసాయం చేసి, అండగా ఉంటామని భరోసానిచ్చిన బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు



# విజృంభిస్తున్న ఎబోలా.. 3,000 దాటిన మరణాలు




**హైదరాబాద్ 03 సెప్టెంబర్ :** ఆఫ్రికా దేశమైన కాంగోలో ఎబోలా వైరస్ రికార్డు స్థాయిలో అత్యంత వేగంగా విజృంభిస్తోంది. మే 15 నుంచి ఇప్పటివరకు ఈ వైరస్ భారీన పడి 3007 మంది మృతి చెంది నట్లు అధికారులు వెల్లడించారు. మరో 6,186 కేసులు నమోదయ్యా యని తెలిపారు. దేశంలోని 6 ప్రావిన్స్ లో ఈ వైరస్ వేగంగా విస్తరిస్తోందని తెలిపారు. కేసులను గుర్తించడం కష్టమవుతోందని, మరణాల్లో దాదాాపు60 శాతం చికిత్స కేంద్రాల బయటే నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది.

# హైదరాబాద్‌కు మరో ఊరట.. అందుబాటులోకి సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి!



**హైదరాబాద్ 03 సెప్టెంబర్ :**
ఎస్ఆర్‌డీపీ కింద రూ.620 కోట్లతో నిర్మించిన 3.32 కి.మీ సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి చంచల్‌గూడ జైలు నుంచి సంతోష్‌నగర్ యాదగిరి థియేటర్ వరకు నాలుగు లేన్లతో విస్తరించింది. నగరంలోనే పొడవైన స్టీల్ బ్రిడ్జిగా (గతంలో ఇందిరాపార్క్-వీఎస్‌టీ 2.3 కి.మీ) రికార్డు సృష్టించింది.
ఈ వంతెన అందుబాటులోకి వస్తే నల్గొండ ఎక్స్‌రోడ్ నుంచి ఒవైసీ ఆస్పత్రి జంక్షన్ వరకు ప్రయాణ సమయం 40 నిమిషాల నుంచి 15 నిమిషాలకు తగ్గనుంది.చార్మినార్, చాదర్‌ఘాట్, మలక్‌పేట మీదుగా దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్లే వాహనదారులకు ఎదురయ్యే సైదాబాద్ జంక్షన్ ట్రాఫిక్ ఇక్కట్లకు ఇది శాశ్వత పరిష్కారంగా మారనుంది. పనులు దాదాపు పూర్తికావడంతో త్వరలో వాహనదారులకు అందుబాటులోకి రానుంది.

# ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యంపై సైబరాబాద్ పోలీసుల ప్రత్యేక శ్రద్ధ

- సైబరాబాద్ పోలీస్--ఎస్‌సీఎస్‌సీ ఆధ్వర్యంలో పల్మో, వాస్క్యులర్ స్క్రీనింగ్ క్యాంప్
- దుమ్ము, వాయు కాలుష్యానికి నిరంతరం గురయ్యే సిబ్బందికి ప్రత్యేక వైద్య పరీక్షలు
- ప్రారంభించిన సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్











**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 3 (పీపుల్స్ న్యూస్)**
విధి నిర్వహణలో భాగంగా ప్రతిరోజూ గంటల తరబడి రోడ్లపై పనిచేస్తూ దుమ్ము, వాయు కాలుష్యం, ట్రాఫిక్ సంబంధిత పరిస్థితులకు గురయ్యే ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య పరిరక్షణకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సంయుక్త ఆధ్వర్యంలో యశోదా హాస్పిటల్స్ సహకారంతో ట్రాఫిక్ పోలీసుల కోసం పల్మో అండ్ వాస్క్యులర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు.ఈ ఆరోగ్య శిబిరాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్, ఎస్‌సీఎస్‌సీ చైర్ పర్సన్ డాక్టర్ ఎం. రమేష్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ చంద్ర శేఖర్ రెడ్డి, ఆర్ఐ వెల్ఫేర్ నాగరాజు రెడ్డి, ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవీద్ ఆలమ్ ఖాన్, అసోసియేట్ డైరెక్టర్ వై. భాను మూర్తి పాల్గొన్నారు.

**ఊపిరితిత్తులు, రక్త ప్రసరణపై ప్రత్యేక పరీక్షలు**
శిబిరంలో ట్రాఫిక్ పోలీసులకు పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ (ఫ్రాఖీ), ఫెనా టెస్ట్ (ఖీవచీూ), సిక్స్ మినిట్ వాక్ టెస్ట్ (6వీఔ), వాస్క్యులర్ స్క్రీనింగ్ వంటి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా ఊపిరితిత్తుల పనితీరు, శ్వాసకోశ ఆరోగ్యం, శారీరక సామర్థ్యం, రక్త ప్రసరణ వంటి అంశాలను ప్రాథమికంగా అంచనా వేసే అవకాశం కల్పించారు.యశోదా హాస్పిటల్స్ తరపున హైటెక్ సిటీ యూనిట్ హెడ్ మేఘా చిత్కారా, డీఎంఎస్ డాక్టర్ వెంకట్ రామన్ కొల్లా, మార్కెటింగ్ యూనిట్ హెడ్ ప్రదీప్, కార్పొరేట్ మార్కెటింగ్ హెడ్ సోమశేఖర్, పల్మనాలజిస్ట్ డాక్టర్ గోపీ యెడ్లపాటి, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

**విధి నిర్వహణకు ఆరోగ్యమే కీలకం: సీపీ**
ఈ సందర్భంగా డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో, నిరంతరం దుమ్ము, వాయు కాలుష్యం మధ్య విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులపై శారీరకంగా, ఆరోగ్యపరంగా ఒత్తిడి ఉంటుందని పేర్కొన్నారు.విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది ఆరోగ్యంగా ఉండటం అత్యంత అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు శారీరక వ్యాయామం, యోగా, శ్వాస సంబంధిత వ్యాయామాలను అలవాటుగా చేసుకోవాలని సూచించారు.ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా అవసరమైన వైద్య సలహా, చికిత్సను సరైన సమయంలో పొందవచ్చని సీపీ స్పష్టం చేశారు.పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సైబరాబాద్ పోలీస్, ఎస్‌సీఎస్‌సీ, యశోదా హాస్పిటల్స్ చేపట్టిన ఈ కార్యక్రమం నివారణాత్మక వైద్య సంరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు పోలీసుల్లో ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# ఉపాధ్యాయులను గౌరవించాలి

- కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్
- టీచర్లకు ఆటల పోటీలు
- సందడిగా మారిన మోడ్రన్ ఇఖ్రా స్కూల్




**భద్రాద్రి కొత్తగూడెం:**
ఉపాధ్యాయులను విద్యార్థులు గౌరవించినప్పుడే విద్యాభివృద్ధిలో ముందుకు వెళ్తారని మోడ్రన్ ఇఖ్రా స్కూల్ కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుభాష్ చంద్ర బోస్ నగర్ లో ఉన్న మోడ్రన్ ఇఖ్రా స్కూల్ ల్లో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గురువారం స్కూల్ టీచర్లకు ఆటల పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా షేక్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ అజ్ఞాన అంధకారాన్ని పారద్రోలి విజ్ఞాన కాంతులు పంచుతూ దేశ అభివృద్ధికి బాటలు వేసే భావి భారత పౌరులుగా మలిచే ఉపాధ్యాయులను గౌరవించాలని కోరారు. డాక్టర్లుగా ఇంజినీర్లుగా పోలీసులుగా రాజకీయ నాయకులుగా మలిచే టీచర్లు ఏదైనా అవసరం కలిగి వారి వద్దకు వెళ్ళితే మేము వీరి వల్లే ఈ స్థాయికి వచ్చాం అని మరచి పోయి వ్యవహరించడం బాధాకరం అన్నారు. పిన్ లాండ్ లాంటి దేశాల్లో రాష్ట్రపతి, ప్రధాన మంత్రి కన్నా ఉన్నతంగా చూస్తారని మీ హోదా ఆస్తి అంతస్తులన్నీ చిన్నప్పుడు ఈ టీచర్లు చేయిపట్టి ఓనమాలు దిద్దించడం వల్లే అని ప్రతిఒక్కరూ గుర్తించాలని కోరారు. తులసి దాస్ చెప్పినట్లు దైవం గురువు నా ముందు నిలబడితే ముందుగా గురువుకు దండం చేస్తాను ఎందుకు అంటే ఆ గురువే దైవాన్ని గుర్తించే జ్ఞానం ఇచ్చాడని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఈ ఒక్క రోజు మాత్రమే కాకుండా ప్రతిరోజూ ప్రతిక్షణం గురువులను గౌరవించాలని విద్యార్థులకు తెలిపారు.పాటలతో ఉపాధ్యాయులలో జోష్... ఎప్పుడు తరగతి గదిలో పుస్తకాలతో బోధించి కనిపించే టీచర్లకు స్కూల్ యాజమాన్యం ఆటల పోటీలు పెట్టడం వల్ల వారిలో "జోష్" కనిపించింది. టీచర్లు చిన్న పిల్లలు లాగా మారిపోయి కేరింతల కొడుతూ ఆటలు ఆడడంతో పాఠశాల ఆవరణమంతా సందడిగా కనిపించింది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు పర్వీన్ సుల్తానా, విజయలక్ష్మి, సల్మా, సరస్వతీ, నసరత్, జేఫీషా, లతీఫా, అనితా, రుభీనా, నాజీయా, సుహాన, సల్మా జబీన్, శీరిషా తదితరులు పాల్గొన్నారు.

## పోషక విలువలు సమతులంగా ఉండేవిధంగా

**పోషకాహారాన్ని తీసుకోని సంపూర్ణ ఆరోగ్యాని పోందాలని సర్పంచ్ బోడ రవి నాయక్..**



**చెన్నారావుపేట సెప్టెంబర్ 3**
మండలంలోనిదర్మతండగ్రామపంచాయితీతో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషకాహర వారోత్సవాలను గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమాని ముఖ్య అఅథిగా హజరైన సర్పంచ్ బోడ రవి నాయక్ మాట్లాడుతు ఆకు కూరలు పాలు పండ్లు గ్రుడ్లు పోషక విలువలు అధికంగా ఉండే విధంగా తీసుకోని సంపుర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలని తెలిపారు..పిల్లలకు అన్న ప్రాసన చేయడం జరిగింది.లిచఈ కార్యక్రమంలో కార్యదర్శి చిత్తరంజన్, వార్డు సభ్యురాలు సాలమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ తిరపతి అంగన్వాడి టీచర్ సుజాత, కవిత, సుగుణ, ఆశా వర్కర్ సాలమ్మ, నిర్మల, శ్రీలత, లలిత తదితరులు పాల్గోన్నారు

# ఐడీఎల్ చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

- భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- పారిశుద్ధ్యం, ట్రాఫిక్, భద్రతపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ ఆదేశాలు










**కూకట్‌పల్లి, ప్రతినిధి శ్రవణ్ కుమార్ సెప్టెంబర్ 3 (పీపుల్స్ న్యూస్)**
త్వరలో జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని ఐడీఎల్ చెరువు నిమజ్జన కేంద్రంలో చేపడుతున్న ఏర్పాట్లను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ ఐఏఎస్ గురువారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమం సురక్షితంగా, క్రమబద్ధంగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నిమజ్జన కేంద్రంలో భక్తుల రాకపోకలు, నిమజ్జన సదుపాయాలు, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, విద్యుత్ వెలుగులు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, ఇతర పౌర సదుపాయాలపై జోనల్ కమిషనర్ సమీక్షించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లను నిమజ్జనానికి ముందే పూర్తి చేసి, కార్యక్రమం ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత**
నిమజ్జన కేంద్రం వద్ద పండుగ కాలం మొత్తం నిరంతర పారిశుద్ధ్యాన్ని కొనసాగించాలని మయాంక్ సింగ్ అధికారులను ఆదేశిం చారు. పారిశుద్ధ్య సిబ్బందిని తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచడంతో పాటు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని సూచించారు. నిమజ్జన కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.భక్తుల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన సిబ్బంది, పరికరాలు, పౌర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయం తో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.

**సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి**
నిమజ్జన సమయంలో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ఈ తనిఖీలో కూకట్‌పల్లి సర్కిల్--52 డిప్యూటీ కమిషనర్ జి. అంజనేయులు, కూకట్‌పల్లి జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సి. శ్రీకాంతి, కూకట్‌పల్లి సర్కిల్--52 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. రాజేశ్వరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం), అసిస్టెంట్ ఇంజనీర్ (మెయింటెనెన్స్), అసిస్టెంట్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం), ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా, పరిశుభ్రంగా, క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు నిరంతర పౌర సేవలు అందేలా కూకట్‌పల్లి సర్కిల్--52 అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.

# కాంగ్రెస్ 'వెయ్యి రోజుల దగా పాలన'పై కుత్బుల్లాపూర్‌లో గులాబీ గర్జన

- ●రెవెన్యూ కార్యాలయాల ఎదుట బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా
- ●డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అవినీతిపై విచారణకు డిమాండ్
- ●జీవో 59 పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని వినతి
- ●దళారీ వ్యవస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు










**కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 3 (పీపుల్స్ న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వ 'వెయ్యి రోజుల దగా పాలన'పై బీఆర్ఎస్ శ్రేణులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిరసన గళం విప్పాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు కుత్బుల్లాపూర్, దుండిగల్, బాచుపల్లి మండల రెవెన్యూ కార్యాలయాల ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు ధర్నాలు నిర్వహించాయి. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనల్లో పేదలకు దక్కాల్సిన ఇళ్ల పథకాల అమలులో అక్రమాలకు తావివ్వకూడదని, అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

**'డబుల్ బెడ్‌రూమ్' ఇళ్లపై విచారణ జరపాలి**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలు, దళారీ వ్యవస్థకు తావులేకుండా అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇళ్లను కేటాయించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు దక్కాల్సిన ఇళ్లను అనర్హులకు కేటాయిస్తోందని, కొందరు దళారులు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఉన్నతాధికారులను కోరారు.



**జీవో 59 దరఖాస్తులపై ఎందుకింత జాప్యం?**

పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లకు సంబంధించిన జీవో 59 క్రమ బద్ధీకరణ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్క రించాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. ఏళ్లుగా దరఖాస్తులతోఎదురుచూస్తున్నప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

**'ఇందిరమ్మ ఇళ్లు'పై స్పష్టత ఇవ్వాలి**

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపైనా బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని నిలదీశారు. అర్హులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి దరఖాస్తుదారుల నుంచి రూ. 10 వేలు చెల్లింపులు చేయించారని ఆరోపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కడ ప్రభుత్వ భూమిని కేటాయించారు? ఎన్ని ఇళ్లు నిర్మించనున్నారు? నిర్మాణాలు ఎప్పుడు ప్రారంభమవుతాయి? ఎప్పటిలోగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తారు? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్న నిరుపేదల పరిస్థితిని కొందరు దళారులు తమకు అనుకూలంగా మార్చుకుని డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అవినీతి, అక్రమాలు జరిగితే వాటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రెవెన్యూ అధికారులకు వినతిపత్రం**

ధర్నా అనంతరం డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు, జీవో 59 క్రమబద్ధీకరణ దరఖాస్తుల పెండింగ్, దళారీ వ్యవస్థ తదితర అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరుతూ రెవెన్యూ ఉన్నతాధికారులకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. పేదల ఇళ్ల విషయంలో రాజకీయాలు, దళారీ వ్యవస్థకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, అర్హులకు అన్యాయం జరిగితే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేవెళ్ల శ్రీ సాయి చైతన్య హై స్కూల్ లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





**చేవెళ్ల. సెప్టెంబర్.03**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సాయి చైతన్య హై స్కూల్ లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. నర్సరీ నుండి యూకేజీ చదువుతున్న విద్యార్థులు శ్రీకృష్ణ జన్మాష్టమికి సందర్భంగా వివిధ వేషధారణలో చూడముచ్చటగా ముస్తాబయ్యారు. యూకేజీ చదువుతున్న విద్యార్థి బి.చరణ్ తేజ ఉట్టి కార్యక్రమంలో పాల్గొని తోటి విద్యార్థులను ఉర్రూతలూగించారు. ఉట్టి కొట్టి స్కూల్ ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, యాజమాన్యం తో శభాష్ అనిపించుకున్నారు. మా స్కూల్ లో ప్రతి పండుగకు విద్యార్థులు తప్పకుండా ప్రతిభ కనబరుస్తారని ప్రిన్సిపల్ నరసింహారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

# నిజాయితీ చాటుకున్న ఆలయ ఔట్సోర్సింగ్ సిబ్బంది.



**యాదగిరిగుట్ట, :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి దర్శనార్థం వచ్చిన హైదరాబాద్ కు చెందిన సౌజన్య భక్తురాలు ఆలయంలో దర్శనం చేసుకునే సమయంలో భక్తురాలి తులం నర బంగారు లాకెట్ పోగొట్టుకుంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆలయ ఔట్సోర్సింగ్ సిబ్బందికి దొరకగా తక్షణమే ఆలయ సూపర్డెంట్ ఇన్చార్జ్ ఎస్పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించి తక్షణమే మైక్ లో అనౌన్స్ చేయించి భక్తురాలి వివరాలు తీసుకొని సౌజన్య అనే భక్తురాలికి ఆలయ సూపర్డెంట్ వాసం వెంకటేష్ ఆలయ ఇంచార్జ్ వినోద్ కుమార్ నాయక్ ఎస్పీఎఫ్ సిబ్బంది గోపీనాయక్ ధర్మేష్ ఆధ్వర్యంలో బంగారు లాకెట్ ను తిరిగి భక్తురాలికి అందజేశారు. నిజాయితీ చాటిన ఔట్సోర్సింగ్ సిబ్బందిని అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, తోటి సిబ్బంది భక్తులు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది సురేష్ ఔట్సోర్సింగ్ సిబ్బంది నరసింహ మనీ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

# వైయస్సార్ సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన.రోజు



దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, టీటీడీ లోకల్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యుడు వడ్లోజు వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పేదలకు 25 కిలోల బియ్యం బస్తాలను పంపిణీ చేయడంతో పాటు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్లోజు వెంకటేష్ మాట్లాడుతూ వైఎస్సార్ ఒక వ్యక్తి కాదు ఒక శకం అని, ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు, జలయజ్ఞం, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాల కారణంగా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. వైఎస్సార్ మరణించి ఎన్నేళ్లయినా ప్రజలు నేటికీ కన్నీళ్లతో స్మరించుకుంటున్నారని, తెలంగాణలో కూడా వైఎస్సార్ తరహా పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, జగన్ అధికారంలోకి వస్తే రెండు తెలుగు రాష్ట్రాలకు మేలు జరుగుతుందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మహిళలు, స్థానికులు, వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థుల పరీక్షలు వాయిదా వేయాలి

- ●జీవో 97 రద్దు ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు అటెండెన్స్ కలపాలి
- ●ఎస్‌బీటీఈటీ కార్యదర్శికి వినతిపత్రం అందజేసిన డీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ
- ●తెలంగాణ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్ డిమాండ్



**హైదరాబాద్ : సెప్టెంబర్ 3 (పీపుల్స్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రస్తుతం జరుగుతున్న జీవో 97 రద్దు ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు అటెండెన్స్ కలపాలని, పాలిటెక్నిక్ పరీక్షలను వాయిదా వేయాలని తెలంగాణ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, డీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎరవెల్లి జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ హైదరాబాద్‌లోని తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ (ఎస్‌బీటీఈటీ) కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పుల్లయ్యతో సమావేశమై విద్యార్థుల సమస్యలపై చర్చించింది. అనంతరం విద్యార్థుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా ఎరవెల్లి జగన్ మాట్లాడుతూ.. జీవో 97 రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉద్యమంలో పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. ఉద్యమ కార్యక్రమాల కారణంగా విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోయిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. అదేవిధంగా ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థుల విద్యా సంవత్సరం, భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో మాట్లాడి విద్యార్థులకు అటెండెన్స్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌బీటీఈటీ కార్యదర్శిని కోరినట్లు తెలిపారు. విద్యార్థుల ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పరీక్షల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి ప్రతికూల చర్యలు లేకుండా చూడాలని ఎరవెల్లి జగన్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి డీఎస్ఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారుఈ కార్యక్రమంలో డీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు విశాల్, సందీప్, భవానిశంకర్, నరేష్ నాయక్, సాయి రాజు తదితరులు పాల్గొన్నారు

# రఘునాథపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకం

**జనగామ జిల్లా పోలీస్**



రఘునాథపల్లి మండల కేంద్రంలో ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాల్లో మండల ప్రధాన కార్యదర్శులని నియమించారు దీనికి ఎల్లారెడ్డి గూడెం గ్రామానికి చెందిన మడికంటి మధు ని నియించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు బాధ్యతను అప్పగించినందుకు వరంగల్ జిల్లా పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధనవంతు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మరుజోడు రాంబాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మహిళ పాముకాటుతో చికిత్స పొందుతూ మృతి



**నర్వ, 03 సెప్టెంబర్ :** మండల కేంద్రానికి చెందిన గొల్ల మహేశ్వరి పాము కాటుతో మృతి చెందిన సంఘటన నర్వ మండల కేంద్రము చోటుచేసుకుంది మహేశ్వరి వయసు(24) ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు సంతానం మహేశ్వరి గత రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా రాత్రి రెండు గంటల సమయంలో మహేశ్వరి ఏదో కొరికిందని భర్తకు తెలపగా భర్త గమనించి పాముకాటు వేసిందని గమనించి భర్త నర్వ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మహేశ్వరికి మెరుగైన చికిత్స కోసం మహబూబ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి 108 లో తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

# విద్యార్థినిని లెక్చరర్ తీసుకెళ్లిన ఘటనపై విచారణకు డిమాండ్

**హాస్టల్ సిబ్బంది, కళాశాల యాజమాన్యం తీరుపై పలు అనుమానాలు**



**ఆదోని, 03 సెప్టెంబర్ :**
స్థానిక విశ్వనారాయణ వొకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థినిని అదే కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్ తల్లిదండ్రుల అనుమతి లేకుండా రాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై ఎమ్మిగనూరుకు తీసుకెళ్లి, ఓ గదిలో ఉంచి దాడి చేసినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.బాధిత విద్యార్థిని రాత్రి సుమారు 8 గంటల సమయంలో లెక్చరర్‌తో కలిసి వెళ్లి, మరుసటి రోజు తిరిగి వచ్చిన అనంతరం తీవ్ర భయాందోళనకు గురై తన తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా జరిగిన విషయాన్ని తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. అనంతరం తల్లిదండ్రులు సంబంధిత లెక్చరర్‌ను ప్రశ్నించినట్లు, ఈ సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించిన దృశ్యాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.అయితే, కళాశాల పక్కనే బాలికల బీసీ హాస్టల్ ఉన్నప్పటికీ విద్యార్థిని రాత్రి సమయంలో హాస్టల్ నుంచి బయటకు వెళ్లే పరిస్థితి ఎలా ఏర్పడిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హాస్టల్ వార్డెన్, సిబ్బంది పర్యవేక్షణ ఏమైంది? విద్యార్థినుల భద్రతకు సంబంధించి కళాశాల యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? అనే ప్రశ్నలు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి వినిపిస్తున్నాయి.విద్యార్థినులు రాత్రి సమయం వరకు కళాశాల కార్యాలయంలోనే ఉండాల్సిన పరిస్థితులు ఉంటే, వాటిపై కూడా అధికారులు సమగ్రంగా విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.ఈ ఘటనపై పోలీసులు, జిల్లా విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, విద్యార్థినుల భద్రతకు సంబంధించి హాస్టల్ నిర్వహణ, కళాశాల యాజమాన్యం బాధ్యతలను పరిశీలించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసి, అందుబాటులో ఉన్న సీసీ కెమెరా దృశ్యాలు, హాస్టల్ రికార్డులు తదితర ఆధారాలను పరిశీలించి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# నాగలాపురంలో స్వయంగా పారిశుద్ధ్య పనులు చేపట్టిన బీజేపీ నాయకుడు!!!



**ఆదోని, 03 సెప్టెంబర్ :** ఆదోని మండలం నాగలాపురంలో గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ బీజేపీ నాయకుడు రాఘవేంద్ర గురువారం ప్రత్యేక సేవా కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్త, ఆకులు, వ్యర్థాలను తొలగిస్తూ ఆయన స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు.గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రజా సేవే లక్ష్యంగా సాగుతున్న ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, గ్రామ అభివృద్ధికి ఇలాంటి సేవా పనులు ఎంతో దోహదపడతాయని స్థానికులు కొనియాడారు.

# గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ●శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో ఉత్సవాల నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలి
- ●నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, బారికేడింగ్, సీసీ కెమెరాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
- ●అధికారులకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి ఆదేశాలు






**మేడ్చల్--మల్కాజిగిరి, సెప్టెంబర్ 3 (పీపుల్స్ న్యూస్)**
వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా, సురక్షితంగా, ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఈ నెల 14న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై, 25న నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

**నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గణేష్ మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా ప్రమాణాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జన మార్గాల్లో ఉన్న గుంతలు, దెబ్బతిన్న రహదారులకు ముందస్తుగా ప్యాచ్‌వర్క్ చేపట్టాలని ఆదేశించారు.నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, బారికేడింగ్, విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. చెరువుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నిరంతర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, భక్తులకు ఇబ్బందులు లేకుండా తగినంత పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని తెలిపారు.

**ప్రతి మండపాన్ని ముందస్తుగా తనిఖీ చేయాలి**
మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు సమన్వయంతో ప్రతి వినాయక మండపాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. మండపాల ఏర్పాటు కోసం సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసి, అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని తెలిపారు.విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, కనెక్షన్లను విద్యుత్ శాఖ నిపుణులతో తనిఖీ చేయాలని సూచించారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉత్సవాల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**శోభాయాత్ర మార్గాల్లో భద్రతకు ప్రాధాన్యత**
విగ్రహాల ఊరేగింపు సందర్భంగా వాహనాల్లో యాంత్రిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. నిమజ్జన మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన చెట్లు, ఇతర ప్రమాదకర అంశాలను ముందుగానే తొలగించాలని ఆదేశించారు.చెరువుల వద్ద అవసరమైన సంఖ్యలో క్రేన్లు, బారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. మండపాల వద్ద పరిశుభ్రత, ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని సూచించారు.

**ప్రత్యేక పోలీస్ బందోబస్తు**
ఉత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు, కంట్రోల్ రూమ్, వేగవంతమైన స్పందన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించేలా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని కోరారు.భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ కోరిన విధంగా క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఉత్సవాలను ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు.సమావేశంలో ఆర్డీఓలు వెంకట్ రెడ్డి, శ్యామ్ ప్రకాష్, డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సంతకం చేశారట..! మరి ఆ ఫైల్ ఎక్కడ..?

- ●22-ఏ నుంచి తొలగించామని ప్రచారం.. ప్రభుత్వ భూమి హోదాపై మాత్రం మౌనం
- ●సర్వే నంబర్ 329/2 నుంచి 329/10 వరకు తొలగింపు ఫైల్‌పై సంతకమంటున్న కథనం.. అసలు ఉత్తర్వులు బయటపెట్టేదెప్పుడు?
- ●కే. శ్రావణ్ కుమార్ । ప్రత్యేక విశ్లేషణ



గాజులరామారం--మహాదేవపురం ప్రాంతానికి సంబంధించిన సర్వే నంబర్ 329 ప్రభుత్వ భూమి వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఒక పత్రికలో ప్రచురితమైన కథనంలో 22-ఏ జాబితా నుంచి కొన్ని సర్వే నంబర్లను తొలగించే ఫైల్‌పై కలెక్టర్ సంతకం చేశారని, సంబంధిత కిందిస్థాయి అధికారులను తొలగింపు ప్రక్రియను తక్షణమే అమలు చేయాలని ఆదేశించారని పేర్కొన్నారు.
అయితే ఇక్కడే అసలు ప్రశ్నలు మొదలవుతున్నాయి.
పత్రిక కథనం ప్రకారం 329/2 నుంచి 329/10 వరకు, 308/1ను 22-ఏ జాబితా నుంచి తొలగించే ఫైల్‌పై కలెక్టర్ సంతకం చేసినట్లు వెంకటరెడ్డి వెల్లడించారు. అంటే ఈ సమాచారం కలెక్టర్ అధికారిక ప్రకటనగా కాకుండా, ఒక వ్యక్తి వెల్లడించిన సమాచారంగా కథనంలో ఉంది.అయితే ప్రభుత్వ భూమికి సంబంధించిన ఇంత కీలకమైన నిర్ణయం విషయంలో ఆ ఫైల్ ఏమిటి? ఫైల్ నంబర్ ఎంత? తేదీ ఏమిటి? కలెక్టర్ సంతకం చేసిన ఉత్తర్వు ఎక్కడుంది? అన్నది ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది.
329 మొత్తం భూమి కాదు.. ఇదే అసలు కీలక అంశం!
ఇక్కడ మరో ముఖ్యమైన విషయాన్ని గమనించాలి.
"సర్వే నంబర్ 329ను 22-ఏ నుంచి తొలగించారు" అనే ప్రచారం ఒకటైతే, పత్రికలో ఉన్న సమాచారం మరోటి.
ఆ కథనంలో స్పష్టంగా 329/2 నుంచి 329/10 వరకు అని పేర్కొన్నారు. అంటే సర్వే నంబర్ 329 మొత్తాన్ని తొలగించినట్లు కథనం చెప్పడం లేదు.
అందువల్ల ప్రజలకు స్పష్టత కావాల్సిన ప్రశ్న:
329/2 నుంచి 329/10 వరకు ఏ విస్తీర్ణం?
ఆ భూమి స్వభావం ఏమిటి?
అందులో ప్రభుత్వ భూమి ఏ మేరకు ఉంది?
22-ఏ నుంచి తొలగింపు ఏ కారణంతో జరిగింది?
ఇవి తేలకుండా "ప్రభుత్వ భూమి 22-ఏ నుంచి తొలగిపోయింది" అని సాధారణంగా ప్రచారం చేయడం ప్రజల్లో గందరగోళానికి దారితీసే అవకాశం ఉంది.
"కలెక్టర్ సంతకం" అంటే "భూమి ప్రైవేటు అయిపోయిందా?"
ఇదే అత్యంత ముఖ్యమైన ప్రశ్న.
ఒక ఫైల్‌పై కలెక్టర్ సంతకం చేశారని చెప్పడం ఒక విషయం.
ఆ సంతకం ద్వారా భూమి ప్రభుత్వ హోదా మారిందా? అన్నది మరో విషయం.
22-ఏ జాబితాలో పేరు ఉండటం లేదా లేకపోవడం ఒక్కటే భూమి యాజమాన్యాన్ని నిర్ణయించే అంశంగా చూడలేం. భూమి అసలు స్వభావం, రెవెన్యూ రికార్డులు, పహాణీలు, సేత్వార్/రికార్డ్ ఆఫ్ రైట్స్, ప్రభుత్వ రికార్డులు, సంబంధిత ఉత్తర్వులు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుంది.అందుకే: 22-ఏ నుంచి తొలగింపు = ప్రభుత్వ భూమి ప్రైవేటు భూమిగా మార్పు అని ఎక్కడైనా అర్థం వచ్చేలా ప్రచారం జరుగుతుంటే, దానికి అధికారిక రికార్డు ఆధారం ఏమిటో వెల్లడించాల్సిందే.
కలెక్టర్ నిజంగా ఆదేశించి ఉంటే.. పత్రాలు బయటకు రావాలి
ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.
కలెక్టర్ సంతకం చేసిన ఫైల్ నంబర్ ఏమిటి?
ఆ ఫైల్‌లో ప్రతిపాదన ఎవరు చేశారు?
ఎవరి అభ్యంతరాలపై విచారణ జరిగింది?
ఎలాంటి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు?
తొలగింపు నిర్ణయానికి చట్టపరమైన ఆధారం ఏమిటి?
కలెక్టర్ సంతకం అనంతరం కిందిస్థాయి అధికారులకు ఇచ్చిన లిఖితపూర్వక ఆదేశాలు ఎక్కడ ఉన్నాయి?
ఆ ఆదేశాల మేరకు 22-ఏ రికార్డులో మార్పు నిజంగా నమోదైందా?
ఇవి సాధారణ ప్రశ్నలు కావు. ప్రభుత్వ భూమికి సంబంధించిన ప్రజా ప్రయోజన ప్రశ్నలు.
ప్రచారం ఒక వైపు.. రికార్డు మరో వైపుఈ వివాదంలో ఎవరి వాదన నిజమో, ఎవరి వాదన తప్పో ముందుగానే తీర్పు చెప్పడం కాదు లక్ష్యం.
కానీ ఒక విషయం మాత్రం స్పష్టం:
పత్రికలో ప్రచురించిన వార్త కంటే అధికారిక ఉత్తర్వు ముఖ్యం.
వ్యక్తి చెప్పిన సమాచారం కంటే ప్రభుత్వ రికార్డు ముఖ్యం.
ప్రచారం కంటే ఫైల్ ముఖ్యం.
ఫైల్ కంటే అమలైన అధికారిక రికార్డు ముఖ్యం.
అందుకే "కలెక్టర్ సంతకం చేశారు" అని చెబుతున్నవారు ఆ సంతకం చేసిన పత్రాన్ని ప్రజల ముందుకు తీసుకురావాలి. అదే సమయంలో రెవెన్యూ అధికారులు కూడా ప్రస్తుత రికార్డుల స్థితిని వెల్లడించాలి.
ఇంకో కీలక ప్రశ్న.. తొలగింపుకు కారణమేంటి?
22-ఏ జాబితా నుంచి ఏదైనా భూమిని తొలగించినట్లయితే, దానికి ఒక పరిపాలనా కారణం ఉండాలి.
అది తప్పుగా ప్రభుత్వ భూమిగా నమోదైందా?
లేదా కోర్టు తీర్పు ఆధారమా?
లేదా పాత రెవెన్యూ రికార్డుల పరిశీలన తర్వాత నిర్ణయం తీసుకున్నారా?
లేదా ఏదైనా యాజమాన్య హక్కు నిర్ధారణ జరిగిందా?
లేదా ఇది కేవలం 22-ఏ జాబితా సవరణకు సంబంధించిన పరిపాలనా చర్య మాత్రమేనా?ఈ ప్రశ్నలకు సమాధానం లేకుండా కేవలం "కలెక్టర్ సంతకం చేశారు.. సమస్య పరిష్కారమైంది" అని చెప్పడం పూర్తి సమాచారంగా పరిగణించలేం.
సర్వే నంబర్ 329పై తుది మాట ఎవరిది?
గాజులరామారం సర్వే నంబర్ 329 విషయంలో అసలు నిజం బయటకు రావాలంటే ఇక ప్రచార ప్రకటనలు కాదు.. పత్రాలు బయటకు రావాలి.
329/2 నుంచి 329/10 వరకు భూమి రికార్డులు ఏమంటున్నాయి?
308/1 పరిస్థితి ఏమిటి?
22-ఏ జాబితా నుంచి తొలగింపు ఉత్తర్వు ఉందా?
ఉంటే దాని తేదీ, ఫైల్ నంబర్ ఏమిటి?
కలెక్టర్ సంతకం చేసిన పత్రం ప్రజలకు చూపగలరా?
ఆదేశాల అమలు అనంతరం అధికారిక రికార్డుల్లో మార్పు జరిగిందా?
ప్రభుత్వ భూమి హోదా మారిందా లేదా కేవలం 22-ఏ జాబితాలో మార్పు జరిగిందా?
ఇవే ఇప్పుడు ప్రజల ముందున్న అసలు ప్రశ్నలు.
కే. శ్రావణ్ కుమార్ విశ్లేషణ
"కలెక్టర్ సంతకం చేశారన్న మాటకు విలువ ఉంది.. కానీ ఆ సంతకం చేసిన పత్రానికి ఇంకా ఎక్కువ విలువ ఉంది. ప్రభుత్వ భూమి విషయంలో ప్రచారం కాదు.. రికార్డే ప్రామాణికం. 22-ఏ నుంచి తొలగించామని చెబుతున్నట్లయితే, ఆ నిర్ణయానికి సంబంధించిన పూర్తి అధికారిక ఉత్తర్వులను ప్రజల ముందుంచాలి. అప్పుడే సర్వే నంబర్ 329 వ్యవహారంలో అసలు నిజం ఏమిటో తేలుతుంది.ప్రభుత్వ భూమి ఎవరిది కాదు.. ప్రజల ఆస్తి.
దాని విషయంలో ప్రతి నిర్ణయానికి లెక్క ఉండాలి.. ప్రతి సంతకానికి రికార్డు ఉండాలి.. ప్రతి మార్పుకు అధికారిక ఆధారం ఉండాలి.

**--- కే. శ్రావణ్ కుమార్**

# గణేష్ ఉత్సవాలకు సైబరాబాద్‌లో పకడ్బందీ ఏర్పాట్లు

- ●54 నిమజ్జన కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు
- ●ట్రాఫిక్, పారిశుద్ధ్యం, భద్రతకు అధిక ప్రాధాన్యత
- ●శాఖల మధ్య సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్ణయం






**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 3 (పీపుల్స్ న్యూస్**

గణేష్ ఉత్సవాలు--2026ను సురక్షితంగా, సజావుగా నిర్వహించేందుకు సైబరాబాద్ పోలీస్, మున్సిపల్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి యాక్షన్ ప్లాన్, ముందస్తు ఏర్పాట్లపై సైబరాబాద్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజన ఐఏఎస్, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సున్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వివిధ శాఖలు, ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**54 నిమజ్జన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి**

సైబరాబాద్ పరిధిలో మొత్తం 54 గణేష్ నిమజ్జన కేంద్రాలు ఉన్న నేపథ్యంలో ప్రతి కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు చేపట్టాలని సమావేశంలో చర్చించారు. నిమజ్జన కేంద్రాల వద్ద ట్రాఫిక్ నిర్వహణ, క్రేన్ల ఏర్పాటు, పారిశుద్ధ్యం, విద్యుత్ వెలుగులు, బారికేడింగ్, రోడ్లపై గుంతల పూడ్చివేత, భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు, కంట్రోల్ రూమ్‌ల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు.

**ట్రాఫిక్, జనసమ్మర్దంపై ప్రత్యేక నిఘా**

గణేష్ విగ్రహాల ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల సమయంలో భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు, బారికేడ్లు, సిబ్బంది మోహరింపు తదితర అంశాలపై శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టనున్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను సమావేశంలో చర్చించి, వాటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కేంద్రాల్లో ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు ఉత్సవాల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర సమన్వయం కొనసాగించాలని స్పష్టం చేశారు. సైబరాబాద్ పరిధిలో గణేష్ ఉత్సవాలు సురక్షితంగా, ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, ట్రాఫిక్ అంతరాయం తగ్గేలా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల అధిపతులు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# నాంపల్లి సెషన్స్ డివిజన్ పరిధిలోని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జిగా శ్రీమతి ఎ. శ్రీదేవి బాధ్యతల స్వీకరణ





**- క్రైమ్ బ్యూరో చీఫ్ అమీర్ హుస్సేన్**

నాగర్‌కర్నూల్‌లో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న శ్రీమతి ఎ. శ్రీదేవి, హైదరాబాద్ నాంపల్లి సెషన్స్ డివిజన్ పరిధిలోని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (ఱూూ) కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై నియమితులయ్యారు. ఆమె మంగళవారం నాడు తన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యాలయ అధికారులు మరియు సిబ్బంది శ్రీమతి ఎ. శ్రీదేవిని కలిసి, ఆమెకు సాదర స్వాగతం పలకడంతో పాటు ఆమె కొత్త బాధ్యతలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, విస్తృత స్థాయి న్యాయ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల పరిష్కారాన్ని ప్రోత్సహించడం, అలాగే మధ్యవర్తిత్వం మరియు ఇతర న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే కార్యక్రమాలను అమలు చేయడం వంటి అంశాలపై శ్రీమతి ఎ. శ్రీదేవి కృషి చేయనున్నారు. ఈ ప్రయత్నాలలో న్యాయ సేవా అధికార సంస్థ అధికారులు మరియు సిబ్బంది ఆమెకు పూర్తి సహకారాన్ని అందిస్తున్నారు.

# గాయపడిన ఎస్‌ఐని పరామర్శించిన ట్రాఫిక్ జాయింట్ సీపీ

- ●విధి నిర్వహణలో గాయపడిన కొల్లూరు ట్రాఫిక్ ఎస్‌ఐ దాదా సాహెద్‌కు పరామర్శ
- ●యశోదా ఆసుపత్రిలో ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్య పరీక్షల శిబిరం పరిశీలన
- ●స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్న సున్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్








**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 3 (పీపుల్స్ న్యూస్)**

విధి నిర్వహణలో గాయపడిన కొల్లూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ దాదా సాహెద్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సున్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ పరామర్శించారు. యశోదా ఆసుపత్రికి వెళ్లిన ఆయన ఎస్‌ఐ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాయపడిన ఎస్‌ఐతో మాట్లాడిన జాయింట్ సీపీ, చికిత్స, కోలుకుంటున్న తీరుపై వివరాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వైద్యుల సూచనలను పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో గాయపడిన సిబ్బందికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

**ట్రాఫిక్ సిబ్బందికి పల్మో, వాస్క్యులర్ స్క్రీనింగ్**

అదే సమయంలో యశోదా ఆసుపత్రిలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కోసం పల్మో అండ్ వాస్క్యులర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. సుదీర్ఘ సమయం రోడ్లపై విధులు నిర్వహించడం, దుమ్ము, వాహనాల నుంచి వెలువడే కాలుష్యానికి నిరంతరం గురికావడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడమే లక్ష్యంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జాయింట్ సీపీ సున్‌ప్రీత్ సింగ్ శిబిరంలో జరుగుతున్న వైద్య పరీక్షలను పరిశీలించి, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**సిబ్బందికి ఆదర్శంగా స్వయంగా పరీక్షలు**

ట్రాఫిక్ పోలీసుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు జాయింట్ సీపీ సున్‌ప్రీత్ సింగ్ స్వయంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఆరోగ్యపరమైన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో నిరంతరం రద్దీ రోడ్లపై పనిచేసే సిబ్బంది ఊపిరితిత్తులు, రక్త ప్రసరణకు సంబంధించిన ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించడం ముఖ్యమని అధికారులు తెలిపారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి అవసరమైన వైద్య సలహా, చికిత్స పొందేలా ఈ శిబిరం దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజా సేవలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడమే లక్ష్యంగా ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాలను కొనసాగిస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# చెల్లాపూర్ పాఠశాలలో కన్నుల పండువగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు




**కుల్కచర్ల, సెప్టెంబర్ 4**

చిరునవ్వుల చిలిపి కృష్ణుడు... వెన్నెల పంచే గోపికల అల్లరితో వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం శుక్రవారం వేడుకల వేదికగా మారిపోయింది. పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల దివ్య రూపధారణలతో పాఠశాలకు విచ్చేసి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. నెగ్గలి నెమలి పింఛాలు, తళతళలాడే పీతాంబరాలు, చేతిలో వెన్న కుండలతో చిన్నారి కృష్ణులు చేసిన అల్లరి కంటతడి పెట్టించేంత ముద్దుగా ఉంది.

**– కృష్ణాష్టమి విశిష్టతను వివరించిన ఉపాధ్యాయులు**

ఈ వేడుకల సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ తుప్పలి ఆనంద్ కుమార్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ... శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కృష్ణుడు చూపిన ధర్మ మార్గం, భగవద్గీత ద్వారా మానవాళికి అందించిన నిత్యసత్యాలు, జీవితంలో ఎదురయ్యే కష్టాలను చిరునవ్వుతో ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు సులభమైన ఉదాహరణలతో తెలియజేశారు. చెడుపై మంచి సాధించే విజయానికి శ్రీకృష్ణుడి జీవితమే నిదర్శనమని ఉపాధ్యాయులు కొనియాడా రు. ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలుచిన్నారులు అత్యంత ఉత్సాహంతో నృత్యాలు, పాటలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అందరి ప్రశంసలు అందుకున్నారు. వారి ప్రతిభ చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మురిసిపోయారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దస్తయ్య, స్కానిజర్ బాలయ్య, చందులతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు తిరుపతమ్మ, అంజిలమ్మ, గున్నమ్మ, సత్యమ్మ, లక్ష్మణరావు, లక్ష్మమ్మ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సందని గడ్డ పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.

**కుల్కచర్ల, సెప్టెంబర్ ) :**



వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని ఎస్సీ (డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్) కాలనీ సందని గడ్డ ప్రభుత్వ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత ఘనంగా, కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా పాఠశాల ప్రాంగణ మంతా శ్రీకృష్ణుని నామస్మరణతో, భక్తిభావం తో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ వేడుకల్లో భాగంగా పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ తదితర పౌరాణిక వేషధారణలతో అలరించారు. చిన్నారుల అలంకరణలు, వారి ముద్దుముద్దు మాటలు, నృత్యాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ఉత్సాహంగా ఉట్టి కొట్టి శ్రీకృష్ణుని లీలలను స్మరించుకున్నారు.

**– ?శ్రీకృష్ణుని విశిష్టతను వివరించిన ఉపాధ్యాయులు**

?ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులనుద్దేశించి శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను వివరంగా తెలియజేశారు. శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీత ద్వారా మానవాళికి అందించిన సందేశాన్ని, ధర్మ మార్గంలో నడవాల్సిన అవవిధాన్ని వివరించారు. కృష్ణుని బాల్య లీలలు, గోపికలతో చెలిమి, దుష్ట శిక్షణ – శిష్ట రక్షణ వంటి అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చెప్పి, బాలలు మంచి నైతిక విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ?ఈ వేడుకల విజయవంతం వెనుక ఉపాధ్యాయులు, గ్రామస్థుల సహకారం ఎంతో ఉంది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు భాగ్యమ్మ, ఉపాధ్యాయు లు రాజా గౌడ్, శేఖర్, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అలాగే కాలనీవాసులు పాల్గొన్నారు.

# కృషి లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకకలు రాధ కృష్ణ వేశాధారణ లో చిన్నారులు'








**కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 3 (పీపుల్స్ న్యూస్)**

సూరారం కాలనీ (బ్రాంచ్ 1) మరియు బహదూర్ పల్లి (బ్రాంచ్ 2)కృషి హై స్కూల్ లో కరస్పాండెంట్ పి. శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మరియు గండిమైసమ్మ కృషి బ్రాంచి 3 ప్రిన్సిపల్ నదియా ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. చిన్నారులు చిన్ని కృష్ణులు ముద్దులొలికే గోపికమ్మల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాలలో చిన్ని కృష్ణులు ఉట్టి కొడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పిల్లల కళ నైపుణ్యాలను అభినందిస్తూ రానున్న రోజుల్లో విద్యార్థులు పై చదువులు చదువుకోని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# క్రియేటివ్ కంటెంట్‌తో 'ఆరెంజ్ ఎకానమీ'కి బాటలు

**- ఎన్‌టీఆర్ జిల్లాలో కంటెంట్ క్రియేషన్ అకాడమీ, స్టూడియో ఏర్పాటుపై మంత్రి కందుల దుర్గేష్ సమీక్ష**
**- యువత, మహిళలకు సృజనాత్మక రంగంలో ఉపాధి అవకాశాలు.. పర్యాటక, సాంస్కృతిక వైభవానికి డిజిటల్ ప్రచారం**







**విజయవాడ: సెప్టెంబరు 3, 2026.**
సృజనాత్మకత, డిజిటల్ మీడియా, సాంస్కృతిక రంగాలను ఆర్థికాభివృద్ధితో అనుసంధానిస్తూ 'ఆరెంజ్ ఎకానమీ' అభివృద్ధికి ఎన్‌టీఆర్ జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సమీక్షించారు. గురువారం విజయవాడలోని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా సంబంధిత అధికారులతో మంత్రి సమావేశమై కంటెంట్ క్రియేషన్ స్టూడియో, కంటెంట్ క్రియేషన్ అకాడమీ, కంటెంట్ ల్యాబ్ ఏర్పాటుపై చర్చించారు.సృజనాత్మకత, సాంకేతికతను పర్యాటకం, సంస్కృతి, ఉపాధితో అనుసంధానించడం ద్వారా యువతకు కొత్త అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు విస్తృత డిజిటల్ ప్రచారం కల్పించవచ్చని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

**ఆరెంజ్ ఎకానమీకి ప్రోత్సాహం**
మీడియా, డిజైన్, కథనం, కళలు, సంస్కృతి, వారసత్వం, డిజిటల్ కంటెంట్ వంటి సృజనాత్మక రంగాలకు ఆర్థిక విలువను జోడించడమే ఆరెంజ్ ఎకానమీ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఈ రంగంలో యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలుగా మలచాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌టీఆర్ జిల్లాలో ఏర్పాటు చేసిన కంటెంట్ క్రియేషన్ స్టూడియో, అకాడమీ ఈ దిశగా కీలక వేదికగా నిలుస్తాయని తెలిపారు. ప్రొఫెషనల్ స్థాయిలో వీడియో రికార్డింగ్, ఎడిటింగ్, లైవ్ స్ట్రీమింగ్ తదితర సదుపాయాలతో స్టూడియోను వినియోగించుకోవచ్చని, అకాడమీ ద్వారా కంటెంట్ తయారీ, వీడియో చిత్రీకరణ, ఎడిటింగ్, కథనం, బాధ్యతాయుతమైన సోషల్ మీడియా వినియోగం వంటి అంశాల్లో శిక్షణ అందించవచ్చని చెప్పారు.

**విజయవాడ పర్యాటకానికి డిజిటల్ ప్రచారం**
విజయవాడతో పాటు ఎన్‌టీఆర్ జిల్లాలోని పర్యాటక, చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ ప్రదేశాలను వీడియోలు, రీల్స్, డాక్యుమెంటరీలు, ఇతర డిజిటల్ కంటెంట్ రూపంలో విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. కృష్ణానది పరివాహక ప్రాంతం, నదీతీరం, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, స్థానిక సంస్కృతి తదితర ప్రత్యేకతలను ఆధునిక డిజిటల్ వేదికల ద్వారా దేశ, విదేశీ పర్యాటకులకు చేరువ చేయడం ద్వారా పర్యాటక రంగానికి మరింత ఊతమివ్వవచ్చన్నారు.

**మన సంస్కృతి.. మన వారసత్వానికి డిజిటల్ భద్రత**
జిల్లాలోని జానపద కళలు, సంప్రదాయాలు, పండుగలు, స్థానిక వంటకాలు, కళాకారుల ప్రతిభను డిజిటల్ రూపంలో డాక్యుమెంట్ చేసి భద్రపరచాలని మంత్రి తెలిపారు. దీనివల్ల భవిష్యత్ తరాలకు ఉపయోగపడే డిజిటల్ సాంస్కృతిక ఆర్కైవ్ను రూపొందించే అవకాశం ఉంటుందన్నారు.

**ఇతర జిల్లాలకు ఆదర్శంగా ఎన్‌టీఆర్ జిల్లా**
కంటెంట్ క్రియేషన్ స్టూడియో, అకాడమీ, ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగిస్తూ సాంకేతికత, సృజనాత్మకత, పర్యాటకం, సంస్కృతి, ఉపాధిని ఒకే వేదికపైకి తీసుకురావాలని మంత్రి సూచించారు. ఎన్‌టీఆర్ జిల్లాలో చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని భవిష్యత్‌లో ఇతర జిల్లాల్లోనూ అమలు చేయగలిగే రెప్లికబుల్ మోడల్‌గా అభివృద్ధి చేయాలని అన్నారు.
విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్శివనాథ్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు, గ్రామీణ యువతకు కంటెంట్ క్రియేషన్‌లో శిక్షణ ఇచ్చి వారి ప్రతిభను ఆదాయ వనరులుగా మార్చేందుకు ఈ కంటెంట్ ల్యాబ్ దోహదపడుతుందన్నారు. స్థానిక ప్రాంతాల పర్యాటక ప్రదేశాలు, దేవాలయాలు, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, స్థానిక వంటకాలు, జానపద కళలు తదితర అంశాలపై నాణ్యమైన డిజిటల్ కంటెంట్ రూపొందించడం ద్వారా 'లోకల్ టాలెంట్ -- లోకల్ ఇన్‌కమ్'కు మార్గం సుగమం చేయవచ్చన్నారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా మాట్లాడుతూ కంటెంట్ ల్యాబ్ ఏర్పాటుకు అవసరమైన సుమారు రూ.10 లక్షల నిధులను జిల్లా పర్యాటక మండలి ద్వారా సమకూర్చినట్లు మంత్రికి వివరించారు. ఆర్‌టీఐహెచ్ , పీ4 మార్గదర్శకుల సహకారంతో కంటెంట్ ల్యాబ్ రూపకల్పన, అమలు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లా రెవెన్యూ అధికారి జి.లక్ష్మీ నరసింహాశీ, ఆర్డీఓ వెన్నెల శ్రీను, డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు, డిఇఓ, పర్యాటక శాఖ, ఇతర సంబంధిత పాల్గొన్నారు.

# మహిళ పాముకాటుతో చికిత్స పొందుతూ మృతి



**నర్వ, 03 సెప్టెంబర్ :** మండల కేంద్రానికి చెందిన గొల్ల మహేశ్వరి పాము కాటుతో మృతి చెందిన సంఘటన నర్వ మండల కేంద్రము చోటుచేసుకుంది మహేశ్వరి వయసు(24) ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు సంతానం మహేశ్వరి గత రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా రాత్రి రెండు గంటల సమయంలో మహేశ్వరి ఏదో కొరికిందని భర్తకు తెలపగా భర్త గమనించి పాముకాటు వేసిందని గమనించి భర్త నర్వ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మహేశ్వరికి మెరుగైన చికిత్స కోసం మహబూబ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి 108 లో తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

# విద్యార్థినిని లెక్చరర్ తీసుకెళ్లిన ఘటనపై విచారణకు డిమాండ్

**హాస్టల్ సిబ్బంది, కళాశాల యాజమాన్యం తీరుపై పలు అనుమానాలు**



**ఆదోని, 03 సెప్టెంబర్ :**
స్థానిక విశ్వనారాయణ వొకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థినిని అదే కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్ తల్లిదండ్రుల అనుమతి లేకుండా రాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై ఎమ్మిగనూరుకు తీసుకెళ్లి, ఓ గదిలో ఉంచి దాడి చేసినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.బాధిత విద్యార్థిని రాత్రి సుమారు 8 గంటల సమయంలో లెక్చరర్‌తో కలిసి వెళ్లి, మరుసటి రోజు తిరిగి వచ్చిన అనంతరం తీవ్ర భయాందోళనకు గురై తన తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా జరిగిన విషయాన్ని తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. అనంతరం తల్లిదండ్రులు సంబంధిత లెక్చరర్‌ను ప్రశ్నించినట్లు, ఈ సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించిన దృశ్యాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.అయితే, కళాశాల పక్కనే బాలికల బీసీ హాస్టల్ ఉన్నప్పటికీ విద్యార్థిని రాత్రి సమయంలో హాస్టల్ నుంచి బయటకు వెళ్లే పరిస్థితి ఎలా ఏర్పడిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హాస్టల్ వార్డెన్, సిబ్బంది పర్యవేక్షణ ఏమైంది? విద్యార్థినుల భద్రతకు సంబంధించి కళాశాల యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? అనే ప్రశ్నలు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి వినిపిస్తున్నాయి.విద్యార్థినులు రాత్రి సమయం వరకు కళాశాల కార్యాలయంలోనే ఉండాల్సిన పరిస్థితులు ఉంటే, వాటిపై కూడా అధికారులు సమగ్రంగా విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.ఈ ఘటనపై పోలీసులు, జిల్లా విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, విద్యార్థినుల భద్రతకు సంబంధించి హాస్టల్ నిర్వహణ, కళాశాల యాజమాన్యం బాధ్యతలను పరిశీలించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసి, అందుబాటులో ఉన్న సీసీ కెమెరా దృశ్యాలు, హాస్టల్ రికార్డులు తదితర ఆధారాలను పరిశీలించి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# పేద వర్గాలకు మెరుగైన వైద్యం అందించాలి

**- ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి**
**- ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందితే పేదలకు ఆర్థిక భారం తప్పుతుంది**
**- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా**









**జగ్గయ్యపేట: సెప్టెంబరు 3,2024.**
జగ్గయ్యపేట ఏరియా ఆసుపత్రిలో పేదలు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా జగ్గయ్యపేట ఏరియా ఆసుపత్రిని గురువారం ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్, ల్యాబొరేటరీ, ఓపీ విభాగం, ఆబా జనరేషన్స్, వివిధ వార్డులు, ఇతర వైద్య విభాగాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందులు, పరీక్షలు, వైద్యుల అందుబాటు తదితర అంశాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రి పనితీరులో క్యూఆర్ స్కాన్ వినియోగం తదితర అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా వైద్యులతో మాట్లాడుతూ పేద, బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్యం అందించినప్పుడే వారికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ, తగిన వైద్యం అందకపోతే పేదలు తప్పనిసరిగా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని, తద్వారా వారు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి సమర్థవంతమైన, నాణ్యమైన, మానవతా దృక్పథంతో కూడిన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. పేదలకు వైద్య సహాయం అందించడం ఎంతో గొప్ప విషయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యులుగా పేద ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోగులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని అవసరమైన వైద్య సేవలను అందించాలని తెలిపారు. వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి లోపల, బయట పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. వార్డులు, రోగుల విశ్రాంతి ప్రదేశాలు, మరుగుదొడ్లు, ఆసుపత్రి ప్రాంగణం తదితర ప్రాంతాల్లో నిరంతరం పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధులకు నిర్ణీత సమయానికి హాజరై రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా విధుల్లో సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, మందులు, వైద్య పరికరాలు తదితర ప్రయోజనాలు పేద ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.హరికృష్ణ, వివిధ విభాగాల వైద్యులు డాక్టర్ హరి, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ అరుణ, డాక్టర్ రాజకుమారి, డాక్టర్ జ్యోత్స్న, ఆర్డీఓ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నాగలాపురంలో స్వయంగా పారిశుద్ధ్య పనులు చేపట్టిన బీజేపీ నాయకుడు!!!



**ఆదోని, 03 సెప్టెంబర్ :** ఆదోని మండలం నాగలాపురంలో గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ బీజేపీ నాయకుడు రాఘవేంద్ర గురువారం ప్రత్యేక సేవా కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్త, ఆకులు, వ్యర్థాలను తొలగిస్తూ ఆయన స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు.గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రజా సేవే లక్ష్యంగా సాగుతున్న ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, గ్రామ అభివృద్ధికి ఇలాంటి సేవా పనులు ఎంతో దోహదపడతాయని స్థానికులు కొనియాడారు.

# పరిగిలో ఘనంగా పి.ఆర్.టి.యు నూతన కార్యవర్గ ఎన్నిక



**పరిగి, సెప్టెంబర్ 4 :** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని శ్రీ లక్ష్మి బ్యాంక్వెట్ హాల్‌లో బుధవారం సాయంత్రం పి.ఆర్.టి.యు మండల శాఖ ఆధ్వర్యంలో 2026-2028 విద్యా సంవత్సరాలకు నూతన కమిటీని ఎన్నుకునే కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు బుగ్గయ్య, ప్రధాన కార్యదర్శి రాకేష్‌ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పి.ఆర్.టి.యు వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కడియాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దోమ అమర్నాథ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ?ఈ సందర్భంగా పరిగి మండల ప్రధాన కార్యదర్శి వార్ల రాకేష్ గత రెండు విద్యా సంవత్సరాల కార్యదర్శి నివేదికను సభలో సమర్పించగా, రాష్ట్ర, జిల్లా, మండల మరియు ప్రాథమిక సభ్యులందరూ దానిని ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే పి.ఆర్.టి.యు నిరంతరం శ్రమిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సి.పి.ఎస్ రద్దు, పి.ఆర్.సి అమలు, హెల్త్ కార్డ్స్ మంజూరు తదితర అంశాల్లో ప్రభుత్వం చేస్తున్న జాప్యం సరికాదన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిగిలి శ్రీపాల్ రెడ్డి ఇందిరా పార్క్ వేదికగా స్పష్టం చేసిన విధంగా ప్రభుత్వం వెంటనే పి.ఆర్.సిని అమలు చేయాలని ఆయన పునరుద్ఘాటించారు.ఈ సమావేశంలో పరిగి మండల శాఖ నూతన అధ్యక్షులుగా మంచనపల్లి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా ఎం.డి. ఉస్మాన్ అలీ, ప్రధాన కార్యదర్శిగా డి. మనోహర్, అసోసియేట్ అధ్యక్షులుగా సుధాకర్, తస్లీమా, సంధ్య రాణి, ఉపాధ్యక్షులుగా మహేందర్, రాకేష్, కార్యదర్శులుగా రమేష్, మహేందర్ తదితరులతో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ..కార్యదర్శి బస్వరాజు, బొంరస్‌పేట్ అధ్యక్షులు అనిల్, ప్రధాన కార్యదర్శి శశి, వికారాబాద్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డితో పాటు వివిధ మండలాల కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమ విజయోత్సాహాన్ని నింపారు.

# రోహిత్ పై పనికిమాలిన పుకార్లు ఆపండి



• బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలకు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఫుల్‌స్టాప్ పెట్టారు. బీసీసీఐ అత్యున్నత స్థాయి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ పుకార్లపై స్పందించారు. రోహిత్ శర్మ బాగా ఆడుతున్నాడని, ఇకనైనా ఈ పనికిమాలిన పుకార్లను ఆపేయాలని సూచించారు. ముంబైలోని బీసీసీఐ హెడ్ ఆఫీస్‌లో బుధవారం అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. దేవజిత్ సైకియా అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, బీసీసీఐ సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ హాజరయ్యారు. టీమిండియా భవిష్యత్తు ప్రణాళికలతో పాటు ఆటగాళ్ల గాయాల బెడద, రోహిత్ శర్మ భవితవ్యంపై చర్చించారు. ఈ సమావేశానికి చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ దూరంగా ఉన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగంగా యశస్వి జైస్వాల్‌కు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు రోహిత్ శర్మను జట్టు నుంచి తప్పిస్తారనే పుకార్లను దేవజిత్ సైకియా ఖండించాడు. 'రోహిత్ శర్మ అన్ని మ్యాచ్‌ల్లోనూ చాలా బాగా ఆడుతున్నాడు. లార్డ్స్ వన్డేలోనూ సెంచరీ చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో.. నేను ఈ పనికిమాలిన పుకార్లకు ప్రాధాన్యత ఇవ్వదలుచుకోలేదు.'అని సైకియా స్పష్టం చేశాడు. టీమిండియా ఆటగాళ్ల గాయాల బెడదపై స్పందిస్తూ.. 'రెండు నెలల పాటు ఐపీఎల్‌లో ఆడిన తర్వాత ఇంగ్లండ్‌కు వెళ్లిన 15 మంది సభ్యుల జట్టులో ముగ్గురు- నలుగురు ఆటగాళ్లు గాయపడ్డారు. సేనా(సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల పర్యటనలకు ముందు ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి ఇచ్చేలా, ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడేలా వీలుగా క్రికెట్ షెడ్యూల్‌లో తగిన ఏర్పాట్లు చేస్తాం. నేషనల్ సెంటర్ ఫర్ స్పెషలైజ్డ్ ట్రైనింగ్‌లో హెడ్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్స్ పదవి ఖాళీగా ఉన్నప్పటికీ, అక్కడి ఫిట్‌నెస్, పునరావస సౌకర్యాలను పర్యవేక్షించడానికి ఇప్పటికే 16 మంది అర్హత గల వ్యక్తుల విధుల్లో ఉన్నారు.'అని దేవజిత్ సైకియా పేర్కొన్నారు.

# ప్రధాన కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్!?



ఆసియా గేమ్స్ 2026 టోర్నీకి టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండనున్నాడు. ఈ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ టోర్నీలో భారత పురుషుల క్రికెట్ జట్టుకు బీసీసీఐ సీఓఈ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం ప్రకటించింది. జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌కు భారత బృందాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. మొత్తం 768 మంది సభ్యులతో కూడిన భారత బృందంలో 503 మంది క్రీడాకారులు, 246 మంది అధికారులు, సహాయక సిబ్బంది, 19 మంది కంటింజెంట్ సిబ్బంది ఉన్నారు. ఆసియా గేమ్స్ నుంచి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు విశ్రాంతి ఇచ్చారు. అప్‌కమింగ్ సిరీస్‌ల కోసం గంభీర్‌కు రెస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో భారత్ వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది. గంభీర్ గైర్హాజరీలో వీవీఎస్ లక్ష్మణ్ జట్టును పర్యవేక్షించనున్నాడు. గంభీర్ సపోర్ట్ టీమ్ కూడా ఈ ఆసియా గేమ్స్‌కు దూరంగా ఉండనుంది. వీవీఎస్ లక్ష్మణ్‌కు సునీల్ జోషి, హృషీకేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్ సపోర్ట్ స్టాఫ్‌గా వ్యవహరిస్తారు. మహిళల జట్టుకు అమోల్ ముజుందార్ హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లోనూ లక్ష్మణ్ భారత జట్టుకు కోచ్‌గా సేవలందించాడు. ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్ అనంతరం గంభీర్‌కు విశ్రాంతి ఇవ్వగా.. లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. ఆసియా గేమ్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్నాయి. చైనా వేదికగా 2022 హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో రెండు జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. అప్పుడు పురుషుల జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించగా.. మహిళల జట్టును హర్మన్‌ప్రీత్ కౌర్ నడిపించింది. మరోవైపు ఆసియా గేమ్స్‌లో క్రికెట్ జట్లకు వసతి ఏర్పాట్లపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నవోకి అలెక్స్ మియాజీ కీలక వివరణ ఇచ్చారు. గదుల కొరత ఉన్నప్పటికీ పాల్గొనే జట్లకు హోటల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 3 వరకు టీ20 క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. జట్లు కోరుకుంటే తమకు నచ్చిన వసతిని స్వయంగా ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఉందని మియాజీ చెప్పారు. సరైన డ్రెస్సింగ్ రూమ్స్ లేకపోవడంతో పాటు వాష్ రూమ్స్ అధ్వాన్నంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వసతులపై బీసీసీఐ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి.





# చరిత్ర సృష్టించిన టామ్ కర్రన్.. టోర్నీలో తొలి హ్యాట్రిక్ నమోదు

**స్పోర్ట్స్ డెస్క్:** యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్(ఈటీపీఎల్)లో మొట్టమొదటి హ్యాట్రిక్ నమోదైంది. ఎడిన్‌బర్గ్ క్యాజికల్ రాకర్స్ పేసర్, ఇంగ్లండ్ స్టార్ టామ్ కర్రాన్ హ్యాట్రిక్ వికెట్లు సాధించాడు. వూర్‌బర్గ్ వేదికగా బెల్‌ఫాస్ట్ వోల్వ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో 59 పరుగులతేడాతో ఎడిన్‌బర్గ్ విజయం సాధించింది. మ్యాచ్ విషయానికి వస్తే...తొలుత బ్యాటింగ్ చేసిన ఎడిన్‌బర్గ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 189 పరుగులు సాధించింది. ఓపెనర్ జేజే స్మట్స్ 98 పరుగులతో ఆ జట్టు భారీ స్కోర్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అతడితో పాటు బ్రెండన్ మెక్‌ముల్లన్ 30 పరుగులతో రాణించాడు. అనంతరం 190 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెల్‌ఫాస్ట్ జట్టు 130 పరుగులకే ఆలౌటైంది. బెల్ ఫాస్ట్ జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది.ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే ట్రెంట్ బౌల్ట్ వరుసగా రెండు వికెట్లు పడగొట్టి ఆ జట్టుకు బిగ్ షాకిచ్చాడు. తర్వాత ఐదో ఓవర్లో పాల్ స్టిర్లింగ్(25)ను కూడా బౌల్ట్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇక మ్యాచ్ చివర్లో కర్రాన్ మ్యాజిక్ చేశాడు. 16వ ఓవర్ వేసిన కర్రాన్.. ఐదో బంతికి ఫ్రెడ్ క్లాసెన్, చివరి బంతికి మాథ్యూ హంఫ్రీస్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత 18వ ఓవర్ వేసేందుకు వచ్చిన టామ్ కర్రాన్ తొలి బంతికి అదైర్‌ను ఔట్ చేసి హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు.కర్రాన్ బౌలింగ్ ధాటికి బెల్‌ఫాస్ట్ 130 పరుగులకే కుప్పకూలింది. ఈ టోర్నీలో ఇప్పటి వరకు కర్రన్ ఐదు వికెట్లు మాత్రమే తీసినప్పటికీ బ్యాటర్లను కట్టడి చేయడంలో సఫలమయ్యాడు. 2019లో జరిగిన టీ20 బ్లాస్ట్‌లో కర్రాన్ గ్లామోర్గాన్‌పై తన తొలి హ్యాట్రిక్‌ను నమోదు చేశాడు. అతడు ప్రస్తుతం ఇంగ్లండ్ క్రికెటర్లలో టీ20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన

# తొలి ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం..





ఐసీసీ మహిళల క్రికెట్‌లో మరో ప్రతిష్ఠాత్మక టోర్నీకి తెరలేచింది. తొలిసారిగా 2027లో ప్రతిపాదించిన ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోంది. వాస్తవానికి ఈ మెగా టోర్నీని శ్రీలంకలో నిర్వహించాలని ముందుగా నిర్ణయించారు. అయితే శ్రీలంక క్రికెట్ బోర్డులో నెలకొన్న పరిస్థితులు, ఐసీసీ సూచించిన సంస్కరణల అమలులో జాప్యం కారణంగా ఈ టోర్నీని అక్కడి నుంచి భారత్‌కు తరలించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రత్యామ్నాయ వేదిక కోసం భారత్‌తో పాటు బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికాలను పరిశీలించిన ఐసీసీ బోర్డు.. సెప్టెంబర్ 1న జరిగిన సమావేశంలో ఇండియాకే ఓటు వేసింది. 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా, వడోదర ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ నిర్ణయంతో భారత అభిమానులకు స్వదేశంలో మరో మెగా ఈవెంట్ చూసే అవకాశం దక్కింది. రౌండ్ రాబిన్ ఫార్మాట్ ఈ ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ పూర్తిగా టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. ఆతిథ్య భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లు ఇందులో తలపడతాయి. లీగ్ దశలో ప్రతి జట్టు మిగతా అన్ని జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫిబ్రవరి 28న జరిగే ఫైనల్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి. శ్రీలంక ఆతిథ్య హక్కులు కోల్పోయినా, టోర్నీలో ఆడే అవకాశాన్ని మాత్రం దక్కించుకుంది. మహిళల క్రికెట్‌కు ఎంతో ప్రోత్సాహం ఈ టోర్నీ మహిళల క్రికెట్‌లో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తుందని ఐసీసీ చైర్మన్ జై షా హర్షం



వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లు పోటీ పడే ఈ ఈవెంట్, గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో పైకి ఎదిగేం దుకు జట్లకు అద్భుతమైన స్ఫూర్తి నిస్తుందని ఆయన అన్నారు. ప్రతి ఏడాదీ ఒక మెగా ఐసీసీ టోర్నీ నిర్వహి ంచడం వల్ల మహిళల ఆటకు ఆదరణ మరింత పెరుగ ుతుందని జై షా ఆశాభావం వ్యక్తం చేశారు.టైటిల్ ఫేవరెట్‌గా టీమిండియా ప్రస్తుతం భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ ఛాంపియన్‌గా సత్తా చాటు తోంది. గత ఏడాది నవీ ముంబైలో జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి టీమిండియా ఈ టైటిల్ గెలుచుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా ప్రస్తుత టీ20 వరల్డ్ కప్ ఛాంపియన్‌గా ఉంది. ఈ ఏడాది లార్డ్స్‌లో జరిగిన ఫైనల్లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఆసీస్ ఏడోసారి కప్పు సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ దిగ్గజ జట్ల మధ్య ట్రోఫీ కోసం తీవ్ర పోటీ నెలకొననుంది.

శుక్రవారం, సెప్టెంబర్ 04, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
12

# దీపికను వెనక్కి నెట్టి.. దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచిన రష్మిక మందన్న




భారత చలనచిత్ర పరిశ్రమలో సరికొత్త అధ్యాయం మొదలైంది. కన్నడ చిత్రసీమ నుంచి ప్రయాణం మొదలుపెట్టి పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రష్మిక మందన్న, తాజాగా దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచారు. ఇటీవల వెలువడిన జాతీయ స్థాయి పాప్యులారిటీ ర్యాంకింగ్‌లో, బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపిక పదుకొణెను వెనక్కి నెట్టి రష్మిక ఈ ఘనత సాధించినట్లు తెలుస్తోంది. ఇది ఆమె కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది.
'పుష్ప: ది రైజ్' చిత్రంలో ఆమె పోషించిన శ్రీవల్లి పాత్ర దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత వచ్చిన 'యానిమల్' సినిమాతో హిందీ ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఇటీవల విడుదలైన 'పుష్ప 2: ది రూల్' ఆమె మాస్ ఇమేజ్‌ను, క్రేజ్‌ను శిఖర స్థాయికి చేర్చింది. దీంతో పాటు 'ఛావా', 'కుబేర' వంటి విభిన్న భాషల చిత్రాలతో తన నటనను, ఉనికిని అన్ని పరిశ్రమలలోనూ బలంగా చాటుకున్నారు.రష్మిక విజయం కేవలం గత చిత్రాలకే పరిమితం కాలేదు. భవిష్యత్తులోనూ ఆమె డైరీ అగ్రశ్రేణి ప్రాజెక్టులతో నిండిపోయింది. రాబోయే అక్టోబర్ 16న విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'రణబాలి' విడుదల కానుండగా, నవంబర్ 27న 'మైసా' ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితో పాటు 'రాకా', 'పుష్ప 3', 'యానిమల్ పార్క్' వంటి భారీ బడ్జెట్ చిత్రాలు కూడా ఆమె ఖాతాలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ ఆమెను దేశంలోనే అత్యంత బిజీగా ఉన్న నటీమణులలో ఒకరిగా నిలబెట్టాయి.
రష్మిక అగ్రస్థానానికి చేరడం అనేది భారతీయ సినిమాలో మారుతున్న సమీకరణాలకు నిదర్శనం. ప్రాంతీయ భాషా చిత్రాల సరిహద్దులు చెరిగిపోయి, ప్రతిభ ఉన్న నటీనటులకు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తోందనడానికి ఆమె విజయమే ఒక ఉదాహరణ. దీపిక పదుకొణె ఇప్పటికీ ఒక ఐకాన్‌గా కొనసాగుతున్నప్పటికీ, పలు భాషల్లో వరుస విజయాలు సాధించి, పాన్ ఇండియా స్టార్‌డమ్‌కు కొత్త నమూనాను సృష్టించారు రష్మిక. ఆమె ప్రయాణం ఆధునిక స్టార్‌డమ్ భాషకు అతీతమని స్పష్టం చేస్తోంది.



# విడుదలకు ముందే సక్సెస్‌మీట్..

## 'రంభ ఊర్వశి మేనక'పై అల్లరి నరేశ్ ఫుల్ కాన్ఫిడెన్స్



కథానాయకుడు అల్లరి నరేశ్ చాలా కాలం తర్వాత తనదైన శైలిలో ఫాంటసీ కామెడీ జోనర్‌లో నటించిన చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. ఈ సినిమా విజయంపై ఆయన పూర్తి ధీమా వ్యక్తం చేశారు. చిత్రం విడుదలకు ముందే సక్సెస్ మీట్ తేదీని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సెప్టెంబర్ 4న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నరేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ కార్యక్రమంలో నరేశ్ మాట్లాడుతూ.. "ఈసారి కచ్చితంగా పెద్ద హిట్ కొడుతున్నాం. సినిమా సెప్టెంబర్ 4న విడుదలవుతుంది, సెప్టెంబర్ 9న సక్సెస్ మీట్ నిర్వహిస్తాం" అని ఎంతో ఆత్మవిశ్వాసంతో పేర్కొన్నారు. 'నాంది' చిత్రం తర్వాత తనకు సోలోగా ఆశించిన విజయం లభించలేదని అంగీకరించిన ఆయన, ఈ సినిమాతో ఆ లోటు తీరుతుందని స్పష్టం చేశారు. ఈ చిత్రంలో నరేశ్ వీకే కూడా కీలక పాత్ర పోషించడంతో ప్రేక్షకులకు వినోదం రెట్టింపు అవుతుందని హామీ ఇచ్చారు.అక్కినేని నాగార్జున నిర్మాణంలో కథానాయకుడిగా నటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, నిర్మాతలు నిమ్మకాయల ప్రసాద్, రాజేశ్ దండా, దర్శకుడు చంద్ర మోహన్ చింతాడలకు కృతజ్ఞతలు తెలిపారు. కథానాయికలు రాశీ సింగ్, విష్ణు ప్రియా, ప్రషా సింగ్‌లు తమ పాత్రల్లో ఎంతో ఉత్సాహంగా నటించారని ప్రశంసించారు. గత కొన్నేళ్లుగా వైవిధ్యమైన సీరియస్ పాత్రలు చేస్తున్న తాను, తిరిగి పూర్తిస్థాయి కామెడీతో ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉందని నరేశ్ పేర్కొన్నారు.



# చేతిలో కొడవలి..

## కమల్ కొత్త గేమ్ మొదలైంది!

'థగ్ లైఫ్' తర్వాత కమల్ హాసన్ హీరోగా ఏ సినిమా ముందుగా సెట్స్‌పైకి వెళ్తుందనే విషయంలో కొంత గ్యాప్ వచ్చింది. అన్బరివ్ దర్శకత్వంలో ఒక సినిమా ప్రకటించినా అది వెంటనే మొదలుకాలేదు. రజనీకాంత్‌తో చేయాల్సిన మరో ప్రాజెక్ట్ కూడా లైన్లో ఉంది. ఈ మధ్యలో ఎస్ యూ అరుణ్ కుమార్‌తో కొత్త సినిమాను కమల్ ప్రకటించారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ కూడా ఒకేసారి బయటకు వచ్చింది.హాశ్రీంశీ =ముం - కరీనా కపూర్ చదువుకుంది ఇంటరేనా? ఆ ఫోటోలో కమల్ చేతిలో పెద్ద కొడవలి పట్టుకుని కనిపించారు. బ్లాక్ షర్ట్, ఆలివ్ గ్రీన్ ప్యాంట్, గ్రే హెయిర్‌తో సింపుల్‌గానే ఉన్నా క్యారెక్టర్ మాత్రం రఫ్‌గా ఉండబోతోందనే ఫీలింగ్ ఇచ్చారు. సినిమా టైటిల్, కథ, పాత్ర గురించి ఇంకా ఏమీ చెప్పలేదు. కానీ రెగ్యులర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ కాకుండా డైరెక్ట్ గా కమల్ క్యారెక్టర్ లుక్‌తో ప్రాజెక్ట్‌ను పరిచయం చేయడం వల్ల మొదటి అప్డేట్‌కే కొంత క్యూరియాసిటీ వచ్చింది. అరుణ్ కుమార్ ఈసారి ఎలాంటి కథతో వస్తాడనే క్యూరియాసిటి కూడా పెరిగింది. పన్నయ్యారుమ్ పద్మినియుమ్, సేతుపతి, చిత్తా, వీర ధీర సూరన్ లాంటి సినిమాలు వచ్చాయి. ముఖ్యంగా స్టార్ హీరో ఉన్నా కథలో పాత్రకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే దర్శకుడిగా ఆయనకు పేరు వచ్చింది. విక్రమ్‌తో చేసిన 'వీర ధీర సూరన్' తర్వాత ఇప్పుడు కమల్ హాసన్‌ను డైరెక్ట్ చేసే అవకాశం దక్కింది.

# దీపావళికి ప్రభుదేవా 'మూన్‌వాక్'...

## నటుడిగా ఏఆర్ రెహమాన్ అరంగేట్రం!

తమిళంతో పాటు తెలుగు, హిందీలో ఒకేసారి విడుదల ప్రముఖ నటుడు, నృత్య దర్శకుడు ప్రభుదేవా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మూన్‌వాక్' ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్రబృందం బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించడమే కాకుండా, తొలిసారి వెండితెరపై నటుడిగానూ మెరవనున్నాడు. ఇందులో ఆయన ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. మనోజ్ ఎన్.ఎస్. దర్శకత్వంలో బిహైండ్‌వుడ్స్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. వినోదం, సంగీతం, నృత్యం ప్రధానాంశాలుగా సాగే ఈ సినిమాను ఒక సంపూర్ణ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించినట్లు చిత్రబృందం పేర్కొంది. ఇందులో ప్రముఖ హాస్యనటుడు యోగిబాబు ఏకంగా 16 విభిన్న పాత్రలు పోషిస్తుండటం విశేషం. అజు వర్గీస్, అర్జున్ అశోకన్, నిష్మా, సుస్మిత, రెడ్డిన్ కింగ్స్‌లీ, మొట్టై రాజేంద్రన్ వంటి భారీ




తారాగణం ఈ చిత్రంలో నటిస్తున్నారు.
పండుగ వాతావరణంలో కుటుంబ సభ్యులందరూ కలిసి చూసేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దామని దర్శకుడు మనోజ్ వెల్లడించాడు. "దీపావళి పండుగ కుటుంబాల మధ్య అనుబంధాన్ని పెంచుతుంది. మా 'మూన్‌వాక్' సినిమా కూడా అదే తరహాలో నవ్వులు, నాట్యం, సంగీతంతో కూడిన ఒక వేడుకలా ఉండాలని ఆశిస్తున్నాం" అని ఆయన వివరించాడు. ఇప్పటికే విడుదలైన 'యేతు', 'టింగా', 'మకరీనా' పాటలకు శ్రోతల నుంచి అద్భుతమైన స్పందన లభించగా, త్వరలో ప్రభుదేవా, ఏఆర్ రెహమాన్ కలిసి కనిపించనున్న 'మయిలే' అనే నాలుగో గీతాన్ని విడుదల చేయనున్నారు.
తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లోనూ ఈ చిత్రం ఏకకాలంలో విడుదల కానుంది. అనూప్ వి. శైలజ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, రోమియో పిక్చర్స్ ప్రపంచవ్యాప్తంగా పంపిణీ హక్కులను, లహరి మ్యూజిక్ ఆడియో హక్కులను సొంతం చేసుకున్నాయి.

# చిన్నగా మొదలైన హిందీ హనుమాన్.. ఇప్పుడు హోంబలేతో..




'హనుమాన్ అంష్' పేరు తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం ఉండకపోవచ్చు. ఇది ఆగస్టు 7న హిందీలో విడుదలైన చిన్న బడ్జెట్ భక్తి చిత్రం. నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా విశాల్ చతుర్వేది తెరకెక్కించారు. పెద్ద స్టార్ కాస్ట్ లేదు, భారీ ప్రమోషన్ కూడా జరగలేదు. మొదటి రోజు ఇండియాలో రూ.10 లక్షల దగ్గరే ఓపెన్ అయింది. కానీ అక్కడి నుంచి మౌత్ టాక్‌తో సినిమా ఊహించని రేంజ్‌లో పెరిగింది. ఇప్పుడు అదే సినిమా ఓవర్సీస్ రిలీజ్‌కు సిద్ధమైంది. దాదాపు రూ.2 కోట్ల బడ్జెట్‌తో తీసిన 'హనుమాన్ అంష్' నాలుగో వారం వరకు థియేటర్లలో నిలబడింది. 27 రోజులకు ఇండియా నెట్ రూ.61 కోట్లకు పైగా చేరినట్టు ట్రేడ్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. మొదటి వారం నెమ్మదిగా వెళ్లిన సినిమా, తర్వాతి రోజుల్లో కలెక్షన్స్ పెంచుకుంది. పెట్టిన బడ్జెట్‌తో పోలిస్తే చాలా పెద్ద రిటర్న్ రావడంతో ఒక్కసారిగా బాలీవుడ్‌లో ఈ సినిమా గురించి మాట్లాడటం మొదలైంది. సినిమా నీమ్ కరోలి బాబా భక్తి, సేవ, హనుమంతుడిపై ఉన్న నమ్మకం చుట్టూ సాగుతుంది. 'డివైన్ డీటూర్' అనే పుస్తకం ఆధారంగా కథను తీసుకున్నారు. శోభినవ్ సత్యా ప్రధాన పాత్రలో నటించారు. ఇప్పటివరకు హిందీ మార్కెట్‌లోనే నడిచిన ఈ చిన్న సినిమాకు ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ ఎంట్రీ ఇచ్చింది. 'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' లాంటి పెద్ద సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న సంస్థ, 'హనుమాన్ అంష్' ఓవర్సీస్ రిలీజ్ బాధ్యత తీసుకుంది. హోంబలే ఓవర్సీస్ ద్వారా సెప్టెంబర్ 11 నుంచి అంతర్జాతీయ మార్కెట్లలో సినిమాను విడుదల చేయబోతున్నారు. ఫార్స్ ఫిల్మ్ కూడా ఈ రిలీజ్‌లో భాగమవుతోంది. రూ.2 కోట్ల చిన్న సినిమా, రూ.10 లక్షల ఓపెనింగ్ నుంచి మొదలై నెల రోజుల్లోనే ఇలాంటి పెద్ద డిస్ట్రిబ్యూషన్ సంస్థ దగ్గరకు వెళ్లడం హైలైట్. పైగా నీమ్ కరోలి బాబాకు విదేశాల్లో కూడా ఫాలోయింగ్ ఉంది. అందుకే ఇండియాలో వచ్చిన రెస్పాన్స్ ను చూసిన తర్వాత ఓవర్సీస్‌లో కూడా సినిమాకు మంచి అవకాశం ఉందని హోంబలే భావించినట్టు కనిపిస్తోంది. సెప్టెంబర్ 11 నుంచి 'హనుమాన్ అంష్'కు కొత్త లెక్క మొదలవుతుంది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com